
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 23 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్(శని) సా.6.24
సహర్(ఆది) ఉ.4.43

ఎండా కాలమ్
	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	22.0



రాజమహేంద్రవరం లోక్‌సభకు పురంధేశ్వరి?

- అనపర్తి స్థానంపై బీజేపీ పెద్దల దృష్టి
- ప్రస్తుత ఎమ్మెల్యే బంధువు ప్రయత్నాలు?
- నల్లమిల్లికే చంద్రబాబు మద్దతు
- రేపో మాపో తేలనున్న వ్యవహారం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి తరఫున రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం బీజేపీకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక్కడ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు చోట్ల టీడీపీ, రెండు చోట్ల జనసేన అభ్యర్థులు బరిలో ఉన్నారు. లోక్‌సభ మాత్రం బీజేపీకి కేటాయించినా ఇంకా అభ్యర్థిని ప్రకటించకలేదు. రేపోమాపో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే నెల 18న నామినేషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ రానుంది. అసెంబ్లీ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ఆరంభించారు. ఎంపీ స్థానం కూడా ఖరారైతే ఉమ్మడిగా కార్యక్రమాలు రూపొందించుకోవడానికి ఉమ్మడి కేడర్‌తో పాటు అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఇక్కడ నుంచి పురందేశ్వరిని లోక్‌సభ బరిలో దింపాలని అధిష్ఠానం చూస్తు న్న సంగతి తెలిసిందే.ఈ మేరకు పురందేశ్వరి కూడా సిద్ధంగా ఉన్నారు. ఈ స్థానాన్ని బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కూడా ఆశిస్తు న్నారు. అయితే అవకాశం లేదని అధిష్ఠానం ఇప్పటికే స్పష్టం చేసినట్టు సమాచారం. ఇక జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానం కావాలని బీజేపీ కోరుతు న్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా అనపర్తి అసెంబ్లీ స్థానం తెరమీదకు వచ్చింది. కానీ ఇప్పటికే అక్కడ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. స్థానిక వైసీపీ ఎమ్మెల్యేకు దగ్గర బంధువైన ఓ వ్యక్తి వేరే రాష్ట్రం నుంచి బీజేపీలో కొందరి ముఖ్యు లతో సంబంధాలు పెట్టుకుని ఉన్నట్టు సమాచారం. ఆయనతో బీజేపీ మీద ఒత్తిడి తెచ్చి అనపర్తిలో పోటీ చేస్తే వైసీపీ అభ్యర్థికి మేలు జరుగుతుందనే యోచనతో కూడా ఇక్కడ కొందరు ప్రయ త్నం చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. కానీ ఇక్కడ టీడీపీ అభ్యర్థి గట్టినాయకుడే. నిత్యం పోరాటాలతో ప్రజలో ఉంటున్నారు.దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు కూడా రామకృష్ణారెడ్డికే మద్దతు ఇస్తుండడం గమనార్హం. ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది.లోక్‌సభ అభ్యర్థిని నేరుగా బీజేపీ జాతీయనేతలే ప్రకటించనున్నారు. ఇప్పటికే అసెంబ్లీ అభ్యర్థులు ప్రచారంలో ఉన్నారు.

పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం : పవన్

పొగాకు బ్యారన్లు దగ్ధం 7

గెలిచి.. చంద్రబాబుకు కానుకగా ఇస్తా...



నా పుట్టినరోజున టిక్కెట్ ప్రకటించి చంద్రబాబు నాకు గిఫ్ట్ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేసుకుని ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పని చేస్తా. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తా. అమలాపురం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తాను.

- గంటి హరీష్‌మాధుర్, అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటా...



గత ఐదేళ్లలో అంకితభావంతో చేసిన సేవలను టీడీపీ అధిష్ఠానం గుర్తించి మరోసారి అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను ప్రకటించింది. దుర్మార్గ పాలన అందిస్తున్న జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు ఓటర్ల ముందుకు వెళ్లి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తాను. నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

- అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం టీడీపీ అభ్యర్థి

కాకినాడ సిటీలో గెలిచి చూపిస్తా...



చంద్రబాబు నాపై ఎంతో నమ్మకంతో ఈ సీటు కేటాయించారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కాకినాడ సిటీలో గెలిచిచూపిస్తా. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ఎన్నికల బరిలో దిగుతాను. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలే ఉమ్మడి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయి.

- వనమాడి కొండబాబు, కాకినాడ సిటీ టీడీపీ అభ్యర్థి

ఇక యుద్ధమే



కూటమి లెక్క తేలింది | పోరు మిగిలింది

- టీడీపీ మూడో జాబితా విడుదల
- 2 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన
- కాకినాడ సిటీకి కొండబాబు
- అమలాపురానికి ఆనందరావు
- అమలాపురం లోక్‌సభకు హరీష్‌మాధుర్
- మిగిలింది రాజమండ్రి లోక్‌సభ
- ఉమ్మడి జిల్లాలో 21 స్థానాలకు ఎంపిక
- నేడు పి.గన్నవరం అభ్యర్థి ప్రకటన
- అభ్యర్థులు మంగళగిరి పయనం

టీడీపీ టిక్కెట్లపై ఉత్కంఠ వీడింది.. నిన్నటి వరకు కాకినాడ సిటీ, అమలాపురం టిక్కెట్లపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఎవరు బరిలో ఉంటారు.. ఎవరు ఉండరనే దానిపై.. ఏ పార్టీ నుంచి పోటీ ఉంటుందనే దానిపై రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తూ వచ్చారు. ఎట్టకేలకు టీడీపీ మూడో జాబితా విడుదల చేసి సస్పెన్స్‌కు తెరదించింది. ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం లోక్‌సభ, పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి తేలవలసి ఉంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి/ అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠకు తెరపడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన దాదాపు పూర్తయింది. టీడీపీ శుక్రవారం విడుదల చేసిన మూడో జాబితాలో కాకినాడ సిటీ అసెంబ్లీ, అమలాపురం అసెంబ్లీ, అమలాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఉత్కంఠకు తెరదించింది. కాకినాడ సిటీ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని బలంగా ఢీకొట్టగలిగే నేతను ఎంపిక చేయడంపై పార్టీ హైకమాండ్ దృష్టి సారించింది. సామాజికవర్గ సమతూకంపైనా కసరత్తు చేసింది. చివరకు మత్స్యకార సామాజికవర్గానికే సీటు కేటాయించింది. దీనిలో భాగంగా ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబువైపే మొగ్గు చూపింది. ఆయన్నే అభ్యర్థిగా ఖాయం చేసింది. ఇదిలా ఉండగా కోనసీమ జిల్లాలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ప్రకటించారు. అడుగడుగునా ఆటంకాలను ఎదుర్కొని అమలాపురం అసెంబ్లీ సీటు దక్కించుకున్నారు. ఇందుకు మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణ తనయుడు రమణబాబుతో పాటు ఆయన వర్గం నేతలు చేసిన కృషి ఫలించింది. పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించే అయితాబత్తుల ఆనందరావును అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కార్యకర్తల్లో జోష్ పెరిగింది. మిగిలిన పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానానికి జనసేన అభ్యర్థిని శనివారం అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది. అమలాపురం లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్‌ను ఎంపిక చేసింది. టీడీపీ అధిష్ఠానానికి అత్యంత విధేయుడిగా ఉన్న హరీష్‌మాధుర్‌కే అమలాపురం లోక్‌సభ అభ్యర్థిత్వం కట్టబెట్టింది. అమలాపురం లోక్‌సభ సీటు కోసం హరీష్‌తో పాటు ఐఏఎస్ అధికారి సతీమణి డాక్టర్ సత్యశ్రీ, పారిశ్రామికవేత్త యాతాటి రమేష్‌బాబు ప్రయత్నించారు. సత్యశ్రీ పట్ల అధిష్ఠానం చివరి క్షణం వరకు ఒకింత సానుకూలతతో ఉన్నప్పటికీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కీలక భూమిక వహించడంతో టిక్కెట్ హరీష్‌నే వరించింది. అయినవిల్లి సిద్ధివినాయక స్వామి ఆలయంలో పూజలు చేసే సమయంలో హరీష్‌ను అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనకు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చారంటూ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

21 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 22 అసెంబ్లీ స్థానాలు ఉండగా 21 స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ఎంపిక మొత్తం పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థుల ఎంపికపై టీడీపీ, జనసేన పార్టీలు ఎట్టకేలకు స్పష్టతనిచ్చేశాయి. ఇన్నాళ్లు కొన్ని సీట్లపై పీటముడి కొనసాగింది. శుక్రవారం మిగిలిన రెండు సీట్లు ప్రకటించడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క స్థానం మినహా అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. కాకినాడ లోక్‌సభ పరిధిలోని ఏడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తేలిపోయింది. మొత్తం ఏడు సీట్లలో టీడీపీ ఐదుచోట్ల, జనసేన రెండుచోట్ల పోటీ చేయడం ఖాయమైంది. ఇటీవల పవన్ పిఠాపురం సీటు నుంచి తానే పోటీ చేస్తున్నట్టు స్వయంగా వెల్లడించడంతో సస్పెన్స్ వీడింది. కాకినాడ సిటీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం జరిగింది. టీడీపీ మాత్రం ఈ స్థానంపై ఎడతెగని కసరత్తు చేసింది. ప్రత్యర్థి వైసీపీ తరఫున ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థికంగా బలంగా ఉండడంతో అదే స్థాయిలో బలమైన అభ్యర్థిని నిలబెట్టే ఉద్దేశంతో టీడీపీ అధిష్ఠానం ఈ సీటుపై వ్యూహాత్మకంగా కదిలింది. ఇతర సామాజికవర్గాల నుంచి బలమైన అభ్యర్థులను సీటు కోసం పరిశీలించింది. కాకినాడ సిటీలో అత్యధికంగా మత్స్యకార సామాజికవర్గం ఉండడంతో వారికి తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. ఈ మేరకు ఆ సామాజికవర్గం వైపే మొగ్గుచూపింది. జిల్లాలో ఒక సీటు మత్స్యకారులకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుండడంతో దాన్ని కాదనలేకపోయింది. అనేక తర్జనభర్జనల తర్వాత చివరకు మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొండబాబు పేరునే ఖాయం చేసింది. దీంతో కాకినాడ జిల్లాలో ఏడు స్థానాల్లో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. మొత్తం ఏడు స్థానాల్లో రెండు సీట్లను బీసీలకు కేటాయించి వెనుకబడిన వర్గాలకు టీడీపీ పెద్దపీట వేసింది. వైసీపీ కూడా ఇప్పటికే ఏడు సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. ఒక్కటంటే ఒక్క సీటు కూడా జిల్లాలో బీసీలకు ఇవ్వకుండా వారిని అవమానించింది. మొత్తం అన్ని సీట్లు ఓసీలకు కట్టబెట్టడంతో వైసీపీ తీరుపై బీసీ వర్గాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. బీసీ వ్యతిరేక పార్టీగా వైసీపీపై కారాలు మిరియాలు నూరుతున్నారు. అటు వైసీపీలో కొన్ని సీట్లకు బీసీ అభ్యర్థులు పోటీకి సిద్ధమైనా కనీసం వారెవరినీ పరిగణలోకి తీసుకోకపోవడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో టీడీపీ 5 జనసేన 2 స్థానాల్లో బరిలో ఉన్నాయి. ఏడు అసెంబ్లీ స్థానాల్లో రెండు ఎస్సీ, ఒకటి బీసీ, నాలుగు ఓసీలకు కేటాయించారు. ఎంపీ అభ్యర్థి తేలవలసి ఉంది. రాజమహేంద్రవరం లోక్‌సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తారని సమాచారం. కోనసీమ జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఆరుచోట్ల అభ్యర్థులను ప్రకటించారు. మూడు ఎస్సీ, ఒక బీసీ, రెండు స్థానాలు ఓసీలకు కేటాయించారు. పి.గన్నవరం అసెంబ్లీ స్థానం విషయానికొస్తే తొలి జాబితాలో టీడీపీ తరఫున సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. తదనంతర పరిణామాల్లో ఆయన వైదొలగడంతో సీటును జనసేన, బీజేపీల్లో ఎవరికి కేటాయిస్తారో అన్న సందిగ్ధత నెలకొంది. జనసేనకే కేటాయించనున్నట్టు పార్టీ పెద్దలు సానుకూలంగా సంకేతాలు పంపాయి. విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును అధిష్ఠానం దాదాపు ఖరారు చేసిందని, శనివారం లాంఛనంగా ప్రకటించనున్నట్టు సమాచారం అందింది. శనివారం మంగళగిరిలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు హరీష్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు పయనమయ్యారు.

ఈసీ చెప్పినా.. లెక్కలేదా!



కోడ్ వచ్చినా మారని | వైసీపీ నాయకుల తీరు


- నేటికీ యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు
- అధికారులకు ఆదేశాలు.. కాదంటే హెచ్చరికలు
- పార్టీ కార్యాలయాలపై తొలగని బొమ్మలు
- రేషన్ వాహనాలపైనా ఇదే పరిస్థితి
- కోడ్ వచ్చి నాలుగు రోజులైనా ఇంతే
- కన్నెత్తి చూడని అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బూతుల మంత్రులను చూసి విస్మయం చెందిన జనం.. జగన్ జమానాలో పద్ధతి 'గాలి'వాటం అయిందంటూ పెదవి విరుస్తున్నారు.ఇప్పుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) పాటించకపోవడం, ఎన్నికల సంఘం ఆదేశాలనూ ధిక్కరించడం చూసి నివ్వెరపోతున్నారు.ముందు నుంచీ క్రమశిక్షణ అనే పదాన్ని పెద్దగా పట్టిం చుకోని వైసీపీ నాయకులు 'చివరికి' రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారంటూ ప్రజలు రుజువులు చూపుతూ ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి ఆరు రోజులు గడిచినా ఇంకా తీరు మాత్రం మారలేదు.అధికారులపై ఇప్పటికీ దర్పం ఒలకబోస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఎంపీ భరత్‌రామ్ తీరుతో ఏకంగా 23 మంది వలంటీర్లకు కంటతడి తప్పలేదు.

ఇప్పటికీ మారని తీరు!

వైసీపీ నాయకులు ముందు నుంచీ బెదిరింపులు, దాడులు, అసాంఘిక కార్యకలాపాలతోనే నెట్టుకొచ్చారు. ప్రశ్నిస్తే పోలీసులను ప్రయోగించి ముప్పుతిప్పలు పెట్టారు. ఈ నాలుగేళ్ల పది నెలల్లో ప్రభుత్వోద్యోగుల నరకం అంటే ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నారంటే అతిశయోక్తి కాదు. చట్టాన్ని పట్టించుకోకుండా మౌఖిక ఆదేశాలు ఇచ్చేయడం.. ఒత్తిడికి తలవంచి అధికారులు నిబంధనలకు నీళ్లొదిలేయడం పరిపాటిగా మారింది. నిబంధనల గురించి చెప్పిన అధికారులపై గట్టి మొట్టికాయ, ఒక్కోసారి వేటు పడేది. కాస్త సౌమ్యంగా, ముక్కుసూటిగా ఉండే అధికారులంటే వైసీపీ పాలకులకు అసలు పడేది కాదు. ఓ ప్రతిపక్ష కార్యకర్తపై రౌడీషీటు తెరవడానికి నిబంధనలు ఒప్పుకోవని చెప్పినందుకు ఓ సీఐని వీఆర్‌కి పంపేశారు. జిల్లాలో ఇది ఓ ఉదాహరణ మాత్రమే. ఎదురు ప్రశ్న వేయకుండా డూడూ బసవన్నల మాదిరిగా 'పని చేసిపెట్టే' అధికారుల ఉద్యోగం జీవితం సాఫీగా సాగేది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వోద్యోగులు ఎన్నికల సంఘం పరిధిలోకి వెళతారు. ఇప్పటికీ యంత్రాంగం ప్రభుత్వ కనుసన్నల్లోనే పనిచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధుల ఇంకా వారిపై ప్రభావం చూపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఎంపీ భరత్ రామ్ ఎన్నికల సంఘం ఆదేశాలను ఉల్లంఘిస్తూ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయడం ఆ విమర్శలకు బలాన్ని చేకూరుస్తోంది. స్వచ్ఛందంగా నియమావళిని అనుసరించి ఇతరులకు ఆదర్శంగా ఉండాల్సిన అధికార పార్టీ నాయకులు ఉల్లంఘనుల్లో మొదటి వరుసలో ఉంటున్నారు. చివరికి చిన్నారులకు ఇచ్చే చిక్కీలపైనా జగన్ బొమ్మను చూసి జగం నవ్వుకున్నారు. ఆ యావ ఎన్నికల కోడ్‌నూ పట్టించుకోవడం లేదు.ఈ నెల 16న సాయంత్రం 3 గంటల సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఇప్పటికీ అధికార పార్టీ హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు దర్శనమిస్తూనే ఉన్నాయి. రూరల్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి చెల్లుబోయిన వేణు బొమ్మూరులో ఏర్పాటు చేసిన రూరల్ తాత్కాలిక కార్యాలయం బోర్డులపై జగన్ బొమ్మలు దర్జాగా దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు లేరు.



ఇదేం చేస్తారు : ఇటీవల ఇచ్చిన ఇంటి పట్టా మధ్యలో జగన్ బొమ్మ

యంత్రాంగం వేగం పుంజుకోలేదా?

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉన్నతాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రేయింబవళ్లు పోలింగ్ స్టేషన్లు పరిశీలన, సమావేశాలతో



రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి, మంత్రి వేణు బొమ్మూరులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయంపై జగన్, వేణు బొమ్మలు

సరిపోతోంది. అయితే క్షేత్రస్థాయిలో యంత్రాంగం ఇంకా వేగం పుంజుకోలేనట్టుగా కనిపిస్తోంది. ప్రధాన కూడళ్లలో ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీలు ఉంటున్నా మీడియా చెప్పే వరకూ తొలగించలేదు. ప్రభుత్వ ఆస్తులు, భవనాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు ఉండొద్దని 24 గంటల్లో పూర్తిగా తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఆ రోజు నుంచి ఆదేశిస్తూనే ఉన్నా ఉల్లంఘనలు కనిపిస్తూనే ఉన్నాయి. కొన్ని బోర్డులపై చిత్రాలు కనబడకుండా కాగితాలను అతికిస్తున్నారు. అవి ఊడిపోతూ నిబంధనలను వెక్కిరిస్తున్నాయి.

అనుమతులు ఉండాల్సిందే

అనుమతులను సరళతరం చేయడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం 'సువిధ' అనే ఒక వెబ్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. ఎంత సులభతరం చేసినా ఉల్లంఘనలు ఆపడం ఎవరి తరమూ కావడం లేదు. రాజకీయ పార్టీలు/అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సిన 25 అంశాలను నిర్దేశించింది. సువిధలో దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల సంఘానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి వస్తుంది. వాళ్లు సంబంధిత పత్రాలను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అవి ఆయా కార్యక్రమాల వద్ద తప్పనిసరిగా అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కొన్నిటికి జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) అనుమతి పొందాల్సి ఉంది. ప్రస్తుతం ఏఏ పార్టీలు వేటికి అనుమతులు ఎప్పటి వరకూ తీసుకున్నాయో జిల్లా స్థాయిలో వివరాలు అందుబాటులో లేనట్లు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ చూసీ చూడకుండా వదిలేస్తున్నారా? అనే అనుమానం సామన్యుడిలో రేకెత్తుతోంది.

తలపోటుగా ..జగన్ యావ

ప్రతి వస్తువుపైనా జగన్ బొమ్మే.. తినే పదార్థాలపైనా ఆయన చిత్రమే. వాస్తవానికి ప్రభుత్వం శాశ్వతం, పాలకులు అశాశ్వతం. కానీ, జగన్ ప్రచార యావ ఆ సత్యానికి విరుద్ధంగా సాగింది. ఇప్పుడు ఆ జగన్ ప్రచార యావ ఎన్నికల వేళ అధికారులకు పాట్లు తెచ్చిపెట్టింది. కొన్నిటిని ఎలా తొలగించాలో తెలియని సందిగ్ధంలో పడిపోయారు. ఉదాహరణకు భూములు లేకుండా ఇంటి స్థలాల జాతరలో భాగంగా ఎన్నికల కోడ్‌కి రెండు రోజుల ముందు పట్టాల పంపిణీ అంటూ హడావుడి చేశారు. ఆ పట్టాలపై జగన్ బొమ్మ ఎలా తీయాలో తెలియని అయోమయం నెలకొంది. ఆ పట్టాలు చింపివేయడం మినహా వేరే దారి లేదు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా వాటి పంపిణీ జరిగింది. వాట్సాప్‌లోనూ పంపించారు. పాఠశాలలకు, వాటర్ ట్యాంకులకు ఇలా ప్రభుత్వ భవనాలు తదితర వాటిని వైసీపీ రంగులతో నింపేశారు. వాటిని ఇప్పుడు ఎలా గీకాలో తెలియడం లేదు. రేషన్ పంపిణీ వాహనాలపై పెద్ద పెద్దగా జగన్ బొమ్మలను వేశారు. వాటిపై ఇప్పుడు కాగితాలు అంటించారు. అవి ఎన్నికలు ముగిసే వరకూ ఉంటాయా? అనేది మీమాంస.

నిర్మలగిరి ఉత్సవాలు ఆరంభం



దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరిమాత ఉత్సవాలు శుక్రవారం ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. కులమతాలకతీతంగా భక్తులు పాల్గొన్నారు. హిందువులు తలనీలాలు ఇచ్చి.. ముడుపులు సమర్పించి.. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు.. 25వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. శని, ఆదివారాల్లో సుమారు 3 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. -7లో



- పెద్దాపురం

అరచేతిలో.. అనుమతులు!

- 'సువిధ' యాప్ ద్వారా 48 గంటల్లో ప్రచార అనుమతులు
- దరఖాస్తుల పరిశీలన అనంతరం జారీ
- ఎన్నికల ప్రక్రియ సులభతరం

ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశం నిర్వహించాలంటే ఇదివరకూ తెల్ల కాగితంపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులు ఇచ్చేవారు. ఇది నాయకులకు చాలా ఇబ్బందిగా ఉండేది. ఎన్నికల సంఘం 'సువిధ' యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రచార అనుమతులు జారీకి అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అనుమతుల జారీచేస్తారు. ఇప్పటికే ఎన్నికల ప్రచార జోరు సాగుతోంది. నామినేషన్ వేయగానే అభ్యర్థులు సభలు, సమావేశాలపై దృష్టిసారిస్తారు. ర్యాలీలతో హోరెత్తిస్తారు. ఎన్నికల ప్రశాంతంగా సాగేందుకు ఎన్నికల సంఘం ప్రచార పర్వంలో నిబంధనలు విధించింది. అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా, ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. దీనికి సువిధ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఇలా చేయాలి..

- అభ్యర్థి తమ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి సువిధ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతోపాటు తమకు ఏవిధమైన అనుమతులు కావాలో వాటిని యాప్‌లో నమోదుచేయాలి.
- అనుమతులకు సంబంధించి మీ సేవ చలానా చెల్లించాలి.
- చెల్లించిన చలానా రసీదు, సువిధలో నమోదుచేసి వివరాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలి.
- దరఖాస్తు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లోనే ఎటువంటి జాప్యం చేయకుండా అనుమతులు జారీచేస్తారు.
- ఏదైనా పరిస్థితిలో జాప్యం జరిగితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వీటన్నింటికీ అవసరమే..

ప్రచారంలో వినియోగించే కార్లు, ద్విచక్ర వాహనాలు ఇంటింటి ప్రచారానికి, ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించేందుకు, సభా నిర్వహణ, సమావేశాల ఏర్పాటు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లౌడ్ స్పీకర్లు, జెండాలు, పోస్టర్ల వినియోగం తదితర ప్రచార అవసరాల కోసం తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇవి పరిశీలన అనంతరం అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు.



సువిధ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సువిధ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సమయం వృథా కాకుండా ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను తీసుకొచ్చింది. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అనుమతుల జారీ చేయడం జరుగుతుంది. అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా ముందుగా అనుమతులు తప్పనిసరి.

- జే.సీతారామారావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం

పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారానికి పవన్ శ్రీకారం

పుర్హుతికా అమ్మవారికి పూజల అనంతరం వారాహి ముందుకు.. విజయ నినాదం రాష్ట్రం నలువైపులా నినదించాలి

వైసీపీ కుయుక్తులు, కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి.. పార్టీ ముఖ్యులతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశం



పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

పిఠాపురం, మార్చి22: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన రాష్ట్రవ్యాప్త ప్రచారాన్ని పిఠాపురం నుంచే శ్రీకారం చుట్టనున్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్ఠాన దేవత పుర్హుతికా అమ్మవారికి పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభిస్తారు. ఇప్పటికే పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పవన్ ప్రకటించిన నేపథ్యంలో పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్త పర్యటనలు జరగనున్నాయి. దత్తాత్రేయ అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడి జన్మస్థలమైన పిఠాపురం నుంచి ప్రచారం ప్రారంభంతో మంచి జరుగుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచారం తదితర అంశాలపై మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీ ముఖ్యనేతలతో శుక్రవారం ఉదయం నుంచి వరుస సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పార్టీ అధ్యక్షులు, టూర్ మేనేజ్‌మెంట్ టీమ్ కన్వీనర్లు, కోకన్వీనర్లతో సమావేశమయ్యారు. తాను పోటీచేసే పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని పవన్ నిర్ణయించారు. ఈ మేరకు పుర్హుతికా అమ్మవారికి పూజలు చేసిన అనంతరం వారాహి వాహనం నుంచి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోనే మూడు రోజులపాటు ఉండి నియోజకవర్గ ముఖ్య నేతలు, మండల నాయకులతో భేటీలు నిర్వహిస్తారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రచారానికి రాకపోకలు సాగించనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కేంద్ర పార్టీ కార్యాలయ వర్గాలను పవన్ ఆదేశించారు. పిఠాపురం నుంచి తాను పోటీ చేస్తున్న నేపథ్యంలో వైసీపీ ఎన్నో పన్నాగాలు, కుయుక్తులు, కుట్రలు పన్నుతోందని, దీంతో ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా నాయకులకు సూచించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించబోతున్నాయని, సమరంలో విజయం ఖచ్చితంగా మనదేనని తెలిపారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టు అనుమతి ఇచ్చిన వెంటనే బాధితులకు న్యాయం

జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు గంగిరెడ్డి

సర్పవరం జంక్షన్, మార్చి 22 : జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు అవసరమైన చట్టబద్ధ, న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఆ సంస్థ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. శుక్రవారం సర్పవరం జంక్షన్‌లోని జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధితులకు శఠగోపం పెట్టిన నిందితులైన పాత చైర్మన్, వైస్ చైర్మన్‌లతోపాటు డైరెక్టర్లు, రుణగ్రస్తులకు చెందిన సుమారు రూ.500కోట్ల పైబడి స్థిరాస్తులను ప్రభుత్వ సహకారంతో సీబీడీ సహకారంతో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఇందులో 39 జీవోల ద్వారా సుమారు రూ.300 కోట్ల మేర సీజ్ చేసిన స్థిరాస్తుల అమ్మకానికి కోర్టులో వేసి సేల్ ఆర్డర్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందన్నారు. ఈ ఆస్తులను విక్రయించుకునేందుకు కోర్టు ఉత్తర్వు ఇచ్చిన వెంటనే బాధితులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీజ్ చేసిన ఆస్తులు, సేల్ ఆర్డర్ కోసం వేచిచూస్తున్న ఆస్తులపై బాధితులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అడ్వాన్సుగా రూ.300 కోట్ల స్థిరాస్తులపై 30 శాతం జయలక్ష్మి సొసైటీకి ఇవ్వాలని ఈనెల 7వ తేదీన సీఎం జగన్‌ని కలుసుకుని వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. బాధితులందరికీ ఆర్థిక న్యాయం చేయడం జరుగుతుందని, కోర్టులో న్యాయపరమైన సాంకేతిక సమస్యలు పరిష్కారం అయిన వెంటనే డిపాజిట్ చేసిన సొమ్ములను బట్టి నగదు చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సొసైటీ వ్యవహారాలన్నీ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, బాధితులు ఎటువంటి అపోహలకు గురికావద్దని కోరారు. పాలకవర్గమంతా బాధితుల ప్రయోజనార్థం పనిచేస్తున్నారని, లోన్లు తీసుకున్న వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ సమయంలోనైనా ఆఫీసుకు వచ్చి కార్యకలాపాలను పరిశీలించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు చింతా సుబ్బారావు, కొమ్మనమంచి గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



జంట హత్యల కేసులో నిందితుడిని చూపుతున్న పోలీసులు

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, మార్చి 22: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరిగిన జంటహత్యల కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు శుక్రవారం వెల్లడించారు. కేసులో నిందితుడు నేరం అంగీకరించి స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు తెలిపారు. చేబ్రోలు గ్రామానికి చెందిన లోకా నాగబాబు అదే గ్రామానికి చెందిన పెండ్యాల లోవతో 22 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నట్టు నాగబాబు తన నేరాంగీకారంలో తెలిపాడు. అయితే లోవ అదే గ్రామానికి చెందిన పోసిన శ్రీనివాస్‌తో సంబంధం ఏర్పరచుకున్నట్టు అనుమానంతో ఇద్దరూ పంటపొలాల్లో ఉండగా హత్య చేయడంతోపాటు లోవ తల్లి ఇసరపు రామలక్ష్మిపై హత్యాయత్నం చేసినట్టు పోలీసులు తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో నాగబాబును గొల్లప్రోలు పోలీసుస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్టు వారు చెప్పారు. హత్యకు వినియోగించిన కత్తి, రక్తంతో తడిచిన బట్టలు, సంఘటనను వీడియో తీసిన సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు బాలురు అరెస్టు

మండపేట, మార్చి22: ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల బాలుర ముఠాను అరెస్టు చేసినట్టు మండపేట పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి తెలిపారు. ఈనెల 11న మండపేట మెయిన్‌రోడ్డులో ఉన్న మెడిప్లస్ మెడికల్ దుకాణంలో ముగ్గురు బాలురు దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా సిబ్బంది పట్టుకునే ప్రయత్నంలో తప్పించుకున్నారన్నారు. ఈనెల 21న మండపేట ఏడిద రోడ్డులో ముగ్గురు బాలురు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన నేరాలను అంగీకరించారన్నారు. బాలురు ముగ్గురు మండపేట, రామచంద్రపురం, సర్పవరం పీఎస్‌ల పరిధిలో తొమ్మిది నేరాలకు పాల్పడ్డారన్నారు. ద్రాక్షారామ, గొల్లపాలెం, తునిలో చేసిన నేరాల్లో బెయిల్ తీసుకుని బయట వచ్చారన్నారు. బాలురు రామచంద్రపురంలో చేసిన దొంగతనం కేసులో రూ.వెయ్యి నగదు, సెల్‌ఫోన్, మండపేట రూరల్ పరిధిలో చేసిన దొంగతనం కేసులో రెండు బైక్స్ వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు బాలురను కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఎస్పీ శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ సీఐ అఖిల్‌జమ నేతృత్వంలో పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి రెండు బృందాలుగా ఏర్పడి బాలురను అరెస్టు చేశారు. ఈ కేసులో రెండు బృందాల్లో పాల్గొన్న పోలీసులు రమేష్, సతీష్, రమణలను ఎస్పీ అభినందించారు.

28న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, మార్చి 22: ఈనెల 28న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం నియమావళికి లోబడి ఈ సమావేశాలు జరుగనున్నామన్నారు. ఈ సమావేశాలకు సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని సీఈవో కోరారు.

వాడపల్లిలో ప్రొటోకాల్ నిలుపుదల

ఆత్రేయపురం, మార్చి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తున్నట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పీఆర్వో కార్యాలయాన్ని మూసివేస్తున్నామన్నారు. భక్తులకు ప్రొటోకాల్, సిఫార్సు లేఖలు, ప్రత్యేక దర్శనాలు, ఆలయ మర్యాదలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిలుపుదల చేసినట్టు ఈవో తెలిపారు. సిబ్బంది ఎన్నికల నియమావళి పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోలీకి ప్రత్యేక రైలు

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈనెల 23న రైలు నెం.07645 సికింద్రాబాద్-సంత్రాగచి, ఈ నెల 25న రైలు నెం.07646 సంత్రాగచి-సికింద్రాబాద్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. వీటికి విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, సామర్లకోటలలో హాల్ట్ సదుపాయం కల్పించారు.

33 అత్యవసర సేవా విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 22: అత్యవసర సేవల్లో పనిచేస్తూ పోలింగ్ కేంద్రాలకు రాలేని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 33 అత్యవసర సేవా విభాగాల ఉద్యోగులు.. రైల్వే, రవాణా సేవలు, పాత్రికేయులు, విద్యుత్‌శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్స్, దూరదర్శన్, రేడియో ఉద్యోగులు, మిల్క్ యూనియన్లు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్, కారాగారాలు, ఎక్సైజ్, అటవీశాఖ, పోలీస్, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, విపత్తు నిర్వహణ వంటి శాఖల ఉద్యోగులు ఉపయోగించుకోవాలన్నారు. దీనికి అవసరమైన ఫారమ్ 12డి అందుబాటులో ఉంచుతామని ఆమె తెలిపారు.





కోరుకొండలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి సదస్యం.. వైభవంగా ఆంజనేయస్వామి వాహనంపై గ్రామోత్సవం దృశ్యం

వైభవంగా నరసింహస్వామి సదస్యం

కోరుకొండ, మార్చి22: చారిత్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు రాత్రి స్వామి ఆలయ ముఖ మండపం వద్ద స్వామి వారికి సదస్యం నిర్వహించారు. వైకానస ఆగమశాస్త్రం ప్రకారం ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో అన్నవరం దేవస్థానం వేద పండితుల సమక్షంలో స్వామి వారి సదస్యం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సదస్యం అంటే స్వామి వారి, అమ్మవారిని ఆశీనులుగావించి మంగళాశాసనం చేయడం, స్వామివారి కల్యాణం జరిగిన మూడో రోజు రాత్రి సదస్యం నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. ఏకాదశి రోజు రాత్రి కల్యాణం జరిగిన లక్ష్మీసమేత నరసింహస్వామి వారికి శ్రీభూసమేత అనంత పద్మనాభస్వామి వారికి ఒకే వేదికపై పక్కపక్క ఆశీనులు గావించి వేద పండితులు మంగళశాసనం చేశారు. అమ్మవారి తరుపున కొందరు పండితులు, స్వామివారి తరుపున కొందరు పండితులు రెండు బృందాలుగా ఏర్పడి అమ్మవారి గుణగణాలను, స్వామి వారి గుణగణాలను కీర్తించారు. అనంతరం స్వామివారికి నాలుగు వేదాలు చదివి వినిపించారు. ఇందుకోసం అన్నవరం దేవస్థానం నుంచి ప్రత్యేకంగా వేదపండితులు వచ్చారు.

ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం రాత్రి లక్ష్మీనరసింహ స్వామివారు అంజనేయ వాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి వాహనం తమ తమ ఇళ్ల ముందుకువచ్చినప్పుడు స్వామి వారికి పండ్లు సమర్పించి మంగళనీరాజనాలు అందించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పరాసర రంగరాజభట్టర్, పరాసర లక్ష్మీనరసింహభట్టర్, అర్చక స్వాములు, వేద పండితులు, ఆగమ బ్రహ్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రంగనాథుని కల్యాణం

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్యకల్యాణమహోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు శనివారం రాత్రి 9 గంటలకు స్వామివారికి రంగనాథస్వామి ఆలయ సన్నిధిలో స్వామి వారికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా రంగనాథస్వామి వారి కల్యాణం కూడా నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం.



పొగాకు బ్యారన్ ద్వారం నుంచి అగ్ని కీలల దృశ్యం

దొండపూడిలో రెండు పొగాకు బ్యారన్‌లు దగ్ధం

రూ.7 లక్షల ఆస్తి నష్టం

గోపాలపురం, మార్చి22: మండలంలోని దొండపూడిలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ రెండు పొగాకు బ్యారన్‌లు కాలిబూడిదయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో మద్దాల స్వాతి, పెనుభూతుల నాగజ్యోతిమౌనికలకు చెందిన పొగాకు బ్యారన్‌లలో శుక్రవారం తెల్లవారుజాము అగ్నికీలలు ఎగసిపడ్డాయి. స్థానికులు గమనించి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమించాల్సి వచ్చింది. బయట నుంచి మంటలను ఆర్పేందుకు వీలు లేకపోవడంతో ముఖద్వారం కిటికీల నుంచే అదుపు చేశారు. ఈ ఘటనలో మద్దాల స్వాతికి చెందిన బ్యారన్‌లో పొగాకు దగ్ధమై రూ.5 లక్షలు, నాగజ్యోతి మౌనిక బ్యారన్‌కు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేసినట్టు తెలిపారు.

విపత్తు నిర్వహణశాఖ మేనేజర్‌గా లావణ్య

కలెక్టరేట్(కాకినాడ), మార్చి22 : కాకినాడ జిల్లా విపత్తు నిర్వహణశాఖ ప్రాజెక్ట్ మేనేజర్‌గా మందుల లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్డీవోగా పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఆమె ఇక్కడికి వచ్చారు.



అల్లవరంలో కారును తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బృందం

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

కారులో ఆధారాలు చూపని రూ.9.75 లక్షలు స్వాధీనం

అల్లవరం, మార్చి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ఒక కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ.9.75 లక్షల నగదు కనిపించింది. హైదరాబాద్ నుంచి వచ్చి భూమి రిజిస్ట్రేషన్ కోసం అమలాపురంలో ఈ నగదు డ్రా చేసుకుని కొమరగిరిపట్నం వెళ్తున్నట్టు కారు యజమాని అధికారులకు తెలిపాడు. సరైన ఆధారం చూపించలేకపోవడంతో ఈ వ్యవహారాన్ని కలెక్టరు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, స్వాధీనం చేసుకున్న నగదును డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్‌కు పంపామని ఎంపీడీవో తెలిపారు. బ్యాంకు మేనేజరు పరిశీలించారని, ఆధారాలు చూపితే నగదు తిరిగి ఇస్తామన్నారు. ఈ తనిఖీల్లో తహశీల్దారు సునీల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శేఖర్‌బాబు, కానిస్టేబుల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో మేరీమాత ఉత్సవాలు

దేవరపల్లి, మార్చి22: గౌరీపట్నం కొండపై 44 ఏళ్ల కిందట మరియమ్మతల్లి వెలిసిందని, అప్పటినుంచి ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక నిలయంగా నిర్మలగిరి పుణ్యక్షేత్రం దిన దినాభివృద్ధి చెందిందని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గౌరీపట్నం మేరీమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రాన్ని ప్రాంతాలకు, మతాలకు అతీతంగా ప్రజలు దర్శించుకుంటారన్నారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో వస్తారన్నారు. శని, ఆదివారాల్లో 3 లక్షల మంది భక్తులు హాజరవుతారని, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో క్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్ బాల, ఫాదర్ మోజేష్, ఫాదర్ జార్జ్ ఫిలిప్, ధర్మరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరు పీఠాధిపతి జయరావు



విద్యుత్ కాంతుల్లో మేరీ మాత ఆలయం



నిందితుడిని అరెస్టు చేసి చూపుతున్న జీఆర్పీ పోలీసులు

రైళ్లలో దొంగ అరెస్ట్.. సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం, మార్చి22(ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు(జీఆర్పీ) అరెస్టు చేశారు. సీఐ విజయశంకర్ వివరాల ప్రకారం.. డీఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆదేశాలతో రైళ్లలో చోరీలు చేస్తున్న వాళ్లపై నిఘా పెట్టామన్నారు. ఈ క్రమంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేటకు చెందిన అన్నెం వీర శ్రీనివాస్‌ని అరెస్టుచేసి రూ.2.70 లక్షల విలువైన 28.70 గ్రాముల బంగారం, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన ఎస్ఐ లోవరాజు, కానిస్టేబుళ్లు వీరబాబు, రవి, రామారావు, ఆర్పీఎఫ్ సిబ్బందిని డీఎస్పీ మోహన్‌రావు, సీఐ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్

గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలు అరెస్టు

రాజానగరం, మార్చి 22: ట్రాలీ బ్యాగుల్లో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహిళలు మార్గమధ్యలో రాజానగరం పోలీసులకు చిక్కారు. జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని తూర్పుగోనగూడెం వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి వ్యవహారం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి సీఐ పి.కాశీవిశ్వనాథ్ శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజుజిల్లా చింతపల్లి మండలం కట్టుబంద గ్రామానికి చెందిన తాంబెల్లి లక్ష్మి, కొమ్మంగి పంచాయతీ పరిధిలోని చిన్న కొత్తవీధి గ్రామానికి చెందిన దిప్పల రాధా అనే మహిళలు గంజాయిని ట్రాలీ బ్యాగుల్లో నింపి చింతపల్లి నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ముందుగా అందిన సమాచారం మేరకు తూర్పుగోనగూడెంవద్ద తనిఖీలు నిర్వహించగా బ్యాగుల్లో రూ.2.10 లక్షల విలువైన 22 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. చెన్నై తరలిస్తున్నట్టుగా నిందితులు చెప్పారన్నారు. ఎస్ఐ మనోహర్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయితోపాటు అదుపులోకి తీసుకున్న నిందితులు

మురారిలో 23 కిలోల గంజాయి స్వాధీనం

గండేపల్లి, మార్చి 22: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వెళ్లే జాతీయ రహదారిలో మురారి గ్రామంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద జగ్గంపేటకు చెందిన కాపవరపు బాలాజీ, అతని స్నేహితుడు నైనపు వెంకట సురేష్‌లు మోటార్‌సైకిల్‌పై విశాఖ ఏజెన్సీ ప్రాంతం ధారకొండ నుంచి సుమారు 23 కిలోల గంజాయిని మోటార్ సైకిల్‌పై తరలిస్తున్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు సీఐ లక్ష్మణరావు ఆదేశాలతో గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్ట ఎస్ఐ తెలిపారు.

ఏజెన్సీ సమాచారం

కోడ్ కూసింది.. నిఘా పెరిగింది

మోతుగూడెం, మార్చి 22: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో డబ్బు, మద్యం రవాణాపై మోతుగూడెం ఎస్ఐ జీగోపాలరావు ప్రత్యేక దృష్టి సారించారు. దీన్ని అరికట్టడానికి చెక్‌పోస్టుల ఏర్పాటుతో తనిఖీలు చేస్తున్నారు. 24గంటలు నిఘాలో భాగంగా వాహనాలు తనిఖీలు ము మ్మరం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రూ.50వేలకు మంచి నగదు ఉండకూడదు. అంతకుమించి నగదు తీసుకెవెళ్తే సరైన ఆధారాలు చూపించాలి. లేకపోతే నగదు సీజ్ చేస్తాం. రెవెన్యూ అధికారుల సమక్షంలో విచారణ చేసి కోర్టుకు సమర్పిస్తాం. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం.

చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ



మోతుగూడెం, రాజవొమ్మంగి మండలాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఫ్లైన్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్స్ యూకే రాజకుమార్, విజయ్, స్మాలన్‌రాజు, సిబ్బంది పాల్గొని తనిఖీలు చేశారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం ఎస్ఐ వెంకయ్య విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని కింద్ర జంక్షన్ వద్ద సిబ్బందితో ఎస్ఐ వాహన తనిఖీలు చేపట్టారు.

శిరీషను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో రంపచోడవరం అభ్యర్థి శిరీష

కూనవరం, మార్చి 22: అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగుతున్న మిరియాల శిరీషను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అన్నారు. కూనవరంలో పర్యటన సందర్భంగా మిరియాల శిరీష మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని ముఖ్యంగా ముంపు మండలాల్లో ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. ప్రతీఏటా గోదావరికి మునుగుతున్న ముంపు గ్రామ ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. మాయమాటలు చెప్పి పోలవరం పరిహారం ఇస్తామని నమ్మబలికారు. ఒక్క రూపాయి కూడా అందజేయలేదన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ముంపు మండల ప్రజలకు అన్నివిధాలా సాయం అందిస్తామని ప్రజలకు హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, గడేశుల రంజిత్‌కుమార్, బీజేపీ నాయకులు పాయం వెంకయ్య, సోముల సత్యనారాయణ, జనసేన నాయకులు దాసరి నరేంద్ర, కూనవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ మల్లంపల్లి హేమంత్ పాల్గొన్నారు.

ఐరన్ రేక్‌లు సరఫరాకు దరఖాస్తు చేసుకోవాలి

రంపచోడవరం, మార్చి 22: సార్వత్రిక ఎన్నికలకు సం బంధించి ఈవీఎంలు భద్రపరిచేందుకు ఐరన్ రేక్‌ల కోసం సరఫరాదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయ చాంబరులో మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలకు సుమారు 160 ఐరన్ రేక్‌లు పంపిణీ చేయగల సరఫరాదారులు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ శిక్షణ కళాశాలలో ఎడ్యుకేషన్ మేళా



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, మార్చి 22: స్థానిక ప్రభుత్వ శిక్షణ కళాశాలలో శుక్రవారం ఆర్ట్ ఎడ్యుకేషన్ మేళ నిర్వహించారు. కార్యక్రమానికి ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూశారు. డీడీ అబూసలాం, ప్రిన్సిపాల్ ఎం.చినబాబు, కళా శాల అధ్యాపకులు డాక్టరు జి.భాస్కర్‌రావు, జె.వెంకటలక్ష్మి, ఎం.సామ్రాజ్యం, కారం బాపిరాజు దొర, కె.సోమశేఖర్, డి.అపర్ణ, కె.పోతురాజు, పి.శ్రీని వాసరెడ్డి, లక్ష్మికుమారి, వి.రాజ్ సిద్దార్థ, పి.లక్ష్మణరెడ్డి, కె.శ్రీనుబాబు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక వైద్య శిబిరం

రంపచోడవరం, మార్చి 22: రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సిరిగిందలపాడులో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద తెలిపారు. గుండెకు సంబం ధించిన వ్యాధులు, ఆయాసం, దడ, బీపీ, షుగరు, చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, ఫిట్స్, చర్మ వ్యాధులతో పా టు స్త్రీలు, పిల్లలు, దంత వ్యాధులకు వైద్య నిపుణులు వైద్యసేవలు అందిస్తారన్నారు. వేమగిరి, పరమహంస నేత్రాలయం వారిచే కంటి వైద్యసేవలు అందిస్తామన్నారు. వైద్యసేవలకు వచ్చే వారు ఆధార్, రేషన్‌కార్డులను తీసుకురా వాలన్నారు.

జీతాలు ఇప్పించండి మహాప్రభో

దేవీపట్నం, మార్చి22: తూర్పుగోదావరి జిల్లాలో సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సీపీడబ్ల్యు స్కీమ్ పురుషోత్తపట్నం సిబ్బంది జీతాలు ఇప్పించండని వేడుకుంటున్నారు. పాత కాంట్రాక్టర్ ఐదు నెలలు, కొత్త కాంట్రాక్టర్ ఐదు నెలలు, కుట్రవాడ 20 నెలలు జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలు లేకపోయిన ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తాగునీరు అందిస్తున్నామన్నారు. ఇటు కాంట్రాక్టర్లు, అటు అధికారులు తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నీటి వనరులు సంరక్షించుకోవాలి

రాజానగరం, మార్చి 22 : ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని గైట్ స్వయం ప్రతిపత్తి కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో చక్రద్వారబంధం హైస్కూల్లో విద్యార్థు లకు శుక్రవారం నీటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ సకల జీవకోటికి జలమే ప్రాణాధారమని వివరించారు. వ్యవసా యానికి డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అనుసరించడంవల్ల నీటిని ఆదా చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో గైట్ ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.డి.శివప్రసాద్, హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం కె.లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

● ప్రపంచ జలదినోత్సవాన్ని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజానగరం హైస్కూల్లోని విద్యార్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పిం చారు. హైస్కూల్ హెచ్ఎం ఎం.రామకృష్ణ పర మహంస, ఎన్ఎస్ఎస్ పీవో షేక్‌మీరా, ఆర్.సుశాంతి, రమణి, పూర్ణలక్ష్మి పాల్గొన్నారు.

పది పరీక్షలకు 31 మంది గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 22: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు శుక్రవారం జరిగిన లెక్కలు పరీక్షకు 31 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు తెలిపారు. 654 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా బిక్కవోలు సెంటర్ నుంచి పది మంది, ఇళ్లపల్లి నుంచి ఆరుగురు, పందలపాక బి సెంటర్ నుంచి 15 మంది హాజరుకాలేదన్నారు.

త్యాగరాజ సంగీతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 22: త్యాగరాజనగర్‌లో శ్రీత్యాగరాజ నారాయణ దాససేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత వార్షికోత్స వాలు ఐదో రోజు శుక్రవారం కొనసాగాయి. రవళి మైలవరపు (చెన్నై)బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నృత్యప్రియులు పాల్గొన్నారు.

అనపర్తిలో ఢిల్లీ పబ్లిక్ కిడ్స్ స్కూల్ ప్రారంభం

అనపర్తి, మార్చి 22: అనపర్తిలో వచ్చే విద్యా సంవత్సరంలో ఢిల్లీ పబ్లిక్ కిడ్స్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్లు ఎంఎస్ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం అనపర్తిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బ్రాంచ్‌ని సాయిమాధవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. టెన్త్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌టెస్టు వచ్చేనెల 7న నిర్వహించనున్నామన్నారు.

రేపు గౌరీపౌర్ణమి అఖండ హరినామ సంకీర్తన

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 22: స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో గౌరీపౌర్ణమి(హోలీ) సందర్భంగా ఆదివారం అఖండ హరినామ సంకీర్తన నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ చైతన్య మిషన్ డిప్యూటీ సెక్రటరీ, ఆలయ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి తెలిపారు. ఉదయం 7గంటలకు ప్రారంభమై 24గంటలపాటు కొనసాగుతుందన్నారు. సోమవారం చైతన్యప్రభు ఆవిర్భావ వేడుక సందర్భంగా సాయంత్రం పంచామృత ఫల పుష్పాలతో స్వామికి విశేష అభిషేకం హారతి, హోలీ అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

● ప్రచారానికి అనుమతులు తీసుకోవాలి
● ఎన్నికల సక్రమ నిర్వహణకు సహకరించాలి
● రాజమహేంద్రవరం ఆర్వో దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: ఎన్నికల నియమావళి పాటించి, రాజమహేంద్రవరం నియోజకవర్గంలో త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగటానికి రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.దినేష్‌కుమార్ కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయపార్టీల నాయకులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక పై ఓట్ల తొలగింపు ప్రక్రియకు ఎటువంటి దరఖాస్తులు స్వీకరించబోమన్నారు. ఓట్ల నమోదుకు వచ్చేనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు అన్నిరకాల దరఖాస్తులు పరిష్కరించామని చెప్పారు. గతంలో 225 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం ఓట్ల ఆధారంగా 7 అదనపు కేంద్రాలను గుర్తించి ఎన్నికల సంఘానికి నివేదించినట్టు ఆర్వో తెలిపారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా నిషేధించామన్నారు. ఎన్నికలకు సంబంధించి సమావేశాలు ఊరేగింపులకు సువిధ యాప్‌లో 48గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడు విడతలుగా ఈవీఎంలు రాండమైజేషన్ జరుగుతుందని, ఎన్నికలు రెండు రోజుల ముందు ఆఖరి విడత రాండమైజేషన్ చేస్తామన్నారు. నామినేషన్లు పార్లమెంట్‌కు నిర్ణీత ఫారం-2ఎలో, అసెంబ్లీకి 2బిలో ఇవ్వాలని, ఫారం-26లో అఫిడవిట్ ఇవ్వాలన్నారు. జాతీయ పార్టీలు, గుర్తించిన రాష్ట్ర పార్టీలకు అభ్యర్థిని ఒకరు ప్రతిపాదించాలని, గుర్తించబడిన పార్టీలకు, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ప్రతిపాదించే వారు ఉండాలన్నారు. నామినేషన్లు రిట్నరింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్వీకరిస్తామన్నారు. ఇందు నిమిత్తం కార్పొరేషన్ కార్యాలయంలోని ఆర్వో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. నియమావళికి సంబంధించి పిర్యాదులు 94940 60060 నెంబరుకు లేదా సి-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చునని చెప్పారు. అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. ఖర్చుల నిమిత్తం ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంటుతెరిచి దానిద్వారా అన్ని ఖర్చు లు చేయాలన్నారు. మే 12న ఎస్‌కేవీటీ డిగ్రీ కాలే జీలో మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని, ఎన్నిక జరిగిన తర్వాత ఈవీఎమ్‌లు, వీవీ ప్యాడ్‌లు తీసుకొనేందుకు నన్నయ యూనివర్శిటీని నిర్ణయించామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి విధివిధానాలు తెలియజేసారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, సర్వీసులో ఉన్న కేంద్ర బలగాలకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తారన్నారు. 85 ఏళ్లు దాటిన వారికి, 40శాతం మించి వైకల్యం ఉన్న వారికి, కొవిడ్ బాధితులకు హోమ్ ఓటింగ్ విధానం ద్వారా ఓటు వేసుకొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు నియమావళిని వివరించారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, తహశీల్దార్ కె.అంజనేయులు, ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆదిరెడ్డి అప్పారావు, మజ్జి రాంబాబు, వైసీపీ నాయకుడు ఎస్వీ శ్రీనివాస్, బీజేపీ నాయకుడు జీవీ రాజారెడ్డి, జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ, డీపీ స్పీ సెంట్రల్, సీఐలు, డీటీలు, టీడీలు పాల్గొన్నారు.



బిక్కవోలు : తొస్సిపూడిలో రైసుమిల్లు కార్మికులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి



రాజమహేంద్రవరం 35వ డివిజన్‌లో టీడీపీలోకి చేరిన కార్యకర్తలతో ఆదిరెడ్డి శ్రీనివాస్

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

● టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, మార్చి 22: టీడీపీ, జనసేన, బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని అనపర్తి ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం తొస్సిపూడిలోని పలు రైసుమిల్లులను సందర్శించి కార్మికులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. అప్పులఊబిలో కూరుకుపోతున్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే మరలా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈయన వెంట దేశం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసమర్థ పాలనను అంతమొందించండి

అనపర్తి: రాష్ట్రంలో అవినీతి, అసమర్థ పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి మండలం కొప్పవరంలో ఆయన రెండవ రోజుకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నల్లమిల్లికి గ్రామస్థుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ నవరత్నాల పేరుతో ప్రజలను నిలువునా ముంచారని ధరలు ఆకాశాన్నంటాయని విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, పోతంశెట్టి వెంకటరామారెడ్డి, అశోక్‌రెడ్డి, వైజాగ్ శ్రీను, సిరసపల్లి లక్ష్మి, కర్రి శేషారత్నం, ఒంటిమి గౌతమి, పోతంశెట్టి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

రాజమహేంద్రవరం సిటీ: వైసీపీ విధానాలతో విసుగుచెందిన వంద మంది మహిళలు టీడీపీలోకి చేరారు. రాజమహేంద్రవరం 34వ డివిజన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వైసీపీ మహిళలను టీడీపీ కండువాలతో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ వింత పాలనతో ప్రజలు చాలా అసంతృప్తిగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో పరాజయం తప్పదన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి కచ్చితంగా అధికారంలోకి వస్తుందన్నారు. విజనరీ కలిగిన చంద్రబాబు పాలనలో ప్రజలు ప్రశాంతమైన జీవితం గడుపుతారని, కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతిఒక్కరు శ్రమించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, యాళ్ల ప్రదీప్, రెడ్డి పార్వతి, బీవీ శివారెడ్డి, పులి శ్రీనివాసరెడ్డి, మాలే విజయలక్ష్మి, సింహా వెంకటేష్, కొల్లి నాని పాల్గొన్నారు.

కాళీ మాత అవతారంలో శ్రీ పాత సోమాలమ్మ



రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 22: స్థానిక శ్యామలానగర్‌లో శ్రీ పాత సోమాలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు కాళీమాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కటారి శ్రీధర్ దంపతులు చండీహోమం నిర్వ హించారు. ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్ ఆధ్వర్యంలో సాయంత్రం సహస్రజ్యోతి లింగార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మాజీ కార్పొరేటర్ ఇసుకప ల్లి శ్రీనివాస్, జవ్వాది మురళీకృష్ణ, ద్వార పార్వతీ సుందరి, కూరాకుల తులసి తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వై.ఫణికుమార్, పూడి ప్రకాష్, సప్పా సిద్ధు, యేరుకొండ సురేష్, కె.కృష్ణమూర్తి, కేలం రమణ, నాగేంద్ర తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన వాణిజ్యశాస్త్ర అధ్యాపకుల శిక్షణ తరగతులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 22: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నూతన విద్యా విధానాన్ని అనుసరించి వాణిజ్యశాస్త్రంలో సరికొత్త బోధనా పద్ధతులపై నిర్వహించిన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం, కాకినాడ నోడల్ రిసోర్సు కేంద్రం పరిధిలోని 19 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.సుధాకర్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం ద్వారా ప్రతి విద్యార్థికి కావాల్సిన నైపుణ్యాలు అలవడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, నాలెడ్జ్ రిసోర్సు పర్సన్ కె.ప్రతిమ, ఆర్‌డీ శిరీషరెడ్డి, కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త ఏఏ అన్నపూర్ణ, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, సీహెచ్ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ప్రైవేట్ చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 22: రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో శుక్రవారం ఒక ఛారిటబుల్ ట్రస్టు ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. దీనికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అక్కడకు వచ్చినవారికి అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణంరాజు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ట్రస్టు నిర్వాహకులు కొత్త సుప్రియ, మేనేజింగ్ ట్రస్టీ కొత్త రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఖాతాలు స్తంభింపజేయడం దారుణం

● పీసీసీ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం దారుణమని పీసీసీ అధికార ప్రతినిధి కొవ్వూరి శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫండ్ ఖాతాలన్నీ స్తంభింపజేయడంపై దేశంలోని మేధావులు, ప్రజాస్వామికవాదులు స్పందించాల్సిన అవసరం వుందన్నారు. బీజేపీ తన ఖాతాల్లో సొమ్మును భద్రపరుచుకుని కాంగ్రెస్ ఖాతాలను ఫ్రీజ్ చేయడంలోని అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేక హోదాగాని, పోలవరం ప్రాజెక్టుగాని పూర్తి చేయలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయాలని ప్రయత్నాలు చేస్తూనే వుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికోడ్ అమలులో ఉండగా అధికార పార్టీ సొంత పనులకు వలంటీర్లను వాడుకోవడం శోచనీయమన్నారు.

గైట్‌లో ఎన్‌సీసీ ఫైరింగ్ శిక్షణ

రాజానగరం, మార్చి 22: ఎన్‌సీసీ ఫైరింగ్ శిక్షణ, ప్రాక్టీస్ ఈఏడాది జూన్ వరకు కొనసాగుతుందని ఎన్‌సీసీ సుబేదార్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ (జీజీయు)లో నూతనంగా ఏర్పాటుచేసిన 50 మీటర్ల ఫైరింగ్ రేంజ్‌లో అంతర్ డైరెక్టర్ స్పోర్ట్స్ షూటింగ్ పోటీలు, ఫైరింగ్ ప్రాక్టీస్ శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా భాస్కరరెడ్డి మా ట్లాడుతూ 18వ ఆంధ్రా బెటాలియన్ నుంచి 3వ బాలికల బెటాలియన్ నుంచి 94మంది ఎన్‌సీసీ విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. ఎంపికైన వారు మౌలాన్కర్‌లోని ఎన్‌సీసీ అఖిల భారత ఫైరింగ్ శిక్షణకు వెళతారని చెప్పారు. అక్కడ ఎంపికైతే జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటా రన్నారు. 18 ఆంధ్ర బెటాలియన్ కమాండర్ కల్నల్ సావన్ గౌదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో గైట్ ఎన్‌సీసీ ఏఎన్‌వో ఎ.తేజేశ్వ రరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోతలకు సిద్ధంగా వరి పంటలు

దివాన్‌చెరువు, మార్చి 22 : ప్రస్తుతం వరిపంట పక్వదశకు చేరుకుని కోతలకు సిద్ధంగా ఉందని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. తాను, మరో ఇద్దరు ప్రధానశాస్త్రవేత్తలతో కలసి నందరాడ, కోటికేశవరం గ్రామాలలోని వరి, మొక్కజొన్న, అపరాలపంట లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశామని శుక్ర వారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వరిపై మానిపండు తెగులు అక్కడక్కడ కనిపిస్తోందని నివారణకు ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్+టెబ్యుకోనాజోల్(నేటివో) మందును లీటరు నీటి కి 0.4గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని అన్నారు. కోతుల నివారణకు సోలార్ కంచె ప్రదర్శన క్షేత్రమును రైతులకు వివరించారు. ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ పి.అమ్మాజీ మాట్లాడుతూ ప్రస్తుత అకాలవర్షాలకు కోతకోసి, పొలంలో పనలు వర్షానికి తడిస్తే గింజమొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలన్నారు. కుప్పలు వేసినట్లయితే ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుం టూ కుప్ప వేయాలన్నారు. మరో ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎస్.హైమాజ్యోతి మాట్లాడుతూ వరి తరువాత లాభదాయక మైన ప్రత్యామ్నాయ పంటలైన మినుము, శనగ, పూలమొక్కల సాగును చేపట్టాలన్నారు. తద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలని సూచించారు.

అక్రమ తవ్వకాలను నిలిపి వేయాలంటూ ఆందోళన

గోకవరం, మార్చి 22: అక్రమ మట్టి తవ్వకాలను నిలిపి వేయాలంటూ గోకవరం మండలం అచ్యుతాపురంలో శుక్రవా రం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అక్రమ తవ్వకాలు జరు పుతున్న ధనంమెట్ట వద్దకు మాజీ ఎంపీటీసీ నల్లల వెంకన్న బాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు వెళ్లి లారీల రాకపోకలను అడ్డుకున్నారు. ఈసందర్భంగా మాజీ ఎంపీటీసీ వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అనుమతి కంటే ఎక్కువగా తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తవ్వకాలు జరుగుతున్న కొండపై గతంలో వివిధ రకాల పక్షులు, పలు రకాల మేలు జాతి చెట్లు ఉండేవని ఇపుడు అవి కానరాకుండా పోయాయని విమర్శించారు. ఇష్టానుసారం లారీలు తిరగడం వల్ల దుమ్ము, ధూళి గ్రామంలోకి ప్రవేశించి గ్రామస్థులు అనారోగ్యం పాలవుతున్నారని, లారీల శబ్దాలకు రాత్రి వేళల్లో నిద్ర ఉండడంలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అక్రమ తవ్వకాలు జరపడం ఎంతవరకు సమంజసమని మాజీ ఎంపీటీసీ ప్రశ్నించారు. ఈవిషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసికెళ్లినా పట్టించుకోవడంలేదని ఆయన వాపోయారు.

జాతీయ రహదారిపై పారిన వేస్ట్ ఆయిల్

● వాహనదారులను అప్రమత్తం చేసిన పోలీసులు



దివాన్‌చెరువు, మార్చి 22: దివాన్‌చెరువులోని జీడిపిక్కలు ఫ్యాక్టరీలో నుంచి వేస్ట్ ఆయిల్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపైకి రావడంతో పోలీసులు అక్కడకు చేరి వాహనదారులను అప్రమత్తం చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఈవిధంగా ఉన్నాయి. స్థానిక జీడిపిక్కల ఫ్యాక్టరీలో ప్రస్తుతం కిసాన్ మార్ట్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సమయంలో ఫ్యాక్టరీ గేటులో నుంచి వేస్ట్ ఆయి ల్ ఎక్కువగా బయటకు వచ్చి జాతీయ రహదారిపైకి చేరింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకోకుండా వాహనదారులను అప్రమత్తం చేశారు. ఫ్యాక్టరీ వద్ద నుంచి దాదాపు 100 మీటర్లు వరకూ ఈ ఆయిల్ పారింది. అక్కడ ఎండు కొమ్మలను అడ్డుగా పడవేసి వాహనదారులు అటు వెళ్లకుండా చేశారు. దీనిపై పోలీసులను ప్రశ్నించగా ట్యాంకుకు చిన్న రంధ్రం పడడంతో ఈవిధంగా జరిగిందని అన్నారు.

ఇరిగేషన్ స్థలంలో పెన్సింగ్ ఏర్పాటు.. ప్రశ్నించిన అర్చకుడిపై దాడి

అనపర్తి, మార్చి 22: అనపర్తి కెనాల్ రోడ్డులో ద్వారపూడి వెళ్లే దారిలో గ్యాస్ గొడౌన్ సమీపంలో ఇరిగేషన్ స్థలంలో గ్రామానికి చెందిన మణికంఠ అనే వ్యక్తి చిన్న రేకుల షెడ్‌లో భగళాముఖి అమ్మవారిని నెలకొల్పి సుమారు ఎనిమిది సంవత్సరాలుగా పూజలు నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలంగా భక్తుల రద్దీ పెరగడంతో దాతల సహకారంలో ప్రతి మంగళవారం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నాడు. ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో అన్నదానం నిర్వహిస్తున్నచోట కొందరు వ్యక్తులు పెన్సింగ్ ఏర్పాటు చేస్తుండటంతో మణికంఠ వారిని ప్రశ్నించాడు. ఇక్కడ ప్రతివారం అన్నదానం చేస్తున్నామని పెన్సింగ్ వేయవద్దంటూ వేడుకున్నాడు. దీంతో పెన్సింగ్ వేస్తున్న వ్యక్తులు మణికంఠపై దురుసుగా ప్రవరిస్తుండటంతో వారిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. వారు కోపోద్రిక్తులై సెల్‌ఫోన్ లాక్కుని మణికంఠపై దాడికి పాల్పడ్డారు. మణికంఠ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తనపై జరిగిన దాడికి, వారు దాడికి పాల్పడినప్పుడు తీసిన వీడియోను పోలీసులకు చూపి తనకు న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా మణికంఠ తనపై జరిగిన దాడికి సంబంధించిన చిత్రీకరించిన వీడియోను మీడియాకు చూపి విలపించాడు. ఎస్ఐ రామారావును వివరణ కోరగా ఫిర్యాదు అందిందని విచారణ నిర్వహిస్తామన్నారు.

ఓటర్లకు ఎంపీ భరత్ తాయిలాలు

● టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు



వైసీపీ ఇచ్చిన బోగస్ పట్టాలను చూపిస్తున్న కూటమి నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: రాజమహేంద్రవరం ఓటర్లకు తాయిలాలు, వలంటీర్లలతో బేరసారాలు ఆడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్ పనైపోయిందని టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో జనసేన నగర ఉపాధ్యక్షుడు రాజేష్ ఖన్నా, కార్యదర్శి తేజోమూర్తుల నర్సింహరావు, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు మాట్లాడారు. ఎంపీ భరత్‌రామ్ ప్రజల సొమ్ముతో సోకులు చేస్తున్నాడని, కార్పొరేషన్‌కు ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నారని భరత్ ఎంపీ నిధులతో ఏమీ చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.125 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించారని చెబుతున్న ఎంపీ రూ.30 కోట్లతో మాత్రమే పనులు చేయించారని, మిగిలినదంతా కార్పొరేషన్ నిధులేనన్నారు. ఆయన చేసిన నీచపు పనివల్ల నగరంలో 23 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారన్నారు. రాజమహేంద్రవరాన్ని గంజాయికి అడ్డాగా భరతే మార్చేశాడన్నారు. ఇటీవల పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో ఇచ్చినవి బోగస్ పట్టాలని, పేదలను మోసం చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు ఒరిజినల్ పట్టాలతోపాటు భూములు అప్పగిస్తారన్నారు. సమావేశంలో టీడీపీ లీగల్ అధ్యక్షుడు నామా సత్యనారాయణ, కొమ్మర్తి బాబ్జి, ప్రకాష్ , పడాల నాగరాజు, బషీర్ పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయిలకు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ

● మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: కొకైన్, గంజాయి వంటి మత్తుమాదక ద్రవ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్‌ను సీఎం జగన్ మార్చేశాడని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ సముద్రతీరానికి డ్రగ్స్ కంటైనర్ రావడం దేశ వ్యాప్తంగా సంచలం కలిగించిందన్నారు. ఇప్పటి వరకు గంజాయికి అడ్డాగా ఉన్న ఏపీని ఇప్పుడు డ్రగ్స్‌లో అంతర్జాతీయ స్థాయికి జగన్ తీసుకెళ్లాడని ఆరోపించారు. ఎన్నికల వేళలో 25000 కిలోల డ్రగ్స్‌ను విశాఖకు తరలించడం వెనుక పెద్దకుట్ర దాగివుందన్నారు. వచ్చిన డ్రగ్స్‌ను వెంటనే తనిఖీ చేయకుండా ప్రభుత్వం ఎందుకు అడ్డుకుందని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఏపీని డ్రగ్స్‌కు రాజధానిగా చేయడమే జగన్ లక్ష్యం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: డ్రగ్స్ రాకెట్ నడపడానికే విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి విశాఖపట్నం నగరంపై కన్నేశారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల వేళ విశాఖ చేరిన డ్రగ్స్ కంటైనర్‌ను తనిఖీ చేయకుండా అడ్డుకోవడానికి అధికారులపై వైసీపీ నాయకులు ఎందుకు ఒత్తిడి తెచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూనం పూర్ణ చంద్రరావుతో విజయసాయిరెడ్డికి వైసీపీ నాయకులకు అక్రమ వ్యాపారాల లావాదేవీలు ఉన్నాయి కాబట్టే ప్రభుత్వ పదవులు కట్టబెట్టారని అన్నారు. ఇప్పటికే జగన్ కల్తీ మద్యంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. డ్రగ్స్ బారినపడి జీవితాలు నాశనం కాకుండా ఉండాలంటే ఈ ఎన్నికల్లో వైసీపీని ఓడించాలన్నారు.

క్రీడాకారుడికి నగదు ప్రోత్సాహకం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 22: స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల విద్యార్థి, క్రీడాకారుడు బి.మోహన్‌రావుకు రిటైర్డ్ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీరామమూర్తి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు మాట్లాడుతూ మోహన్ రావు రెండేళ్లుగా ఆఫ్ మారథాన్ 21కెలో కళాశాలకు బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. శ్రీరామమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాయామ అధ్యాపకులు పి.కిశోర్‌బాబు పీవీబీ సంజీవరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ వైస్వర్ణశ్రీ, డీవీ రమణమూర్తి, జి.శరత్‌బాబు, గాలి వెంకటరమణ పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం లోక్‌సభకు పురంధేశ్వరి?

- అనపర్తి స్థానంపై బీజేపీ పెద్దల దృష్టి
- ప్రస్తుత ఎమ్మెల్యే బంధువు ప్రయత్నాలు?
- నల్లమిల్లికే చంద్రబాబు మద్దతు
- రేపో మాపో తేలనున్న వ్యవహారం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి తరపున రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం బీజేపీకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక్కడ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు చోట్ల టీడీపీ, రెండు చోట్ల జనసేన అభ్యర్థులు బరిలో ఉన్నారు. లోక్‌సభ మాత్రం బీజేపీకి కేటాయించినా ఇంకా అభ్యర్థిని ప్రకటించకలేదు. రేపోమాపో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే నెల 18న నామినేషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ రానుంది. అసెంబ్లీ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ఆరంభించారు. ఎంపీ స్థానం కూడా ఖరారైతే ఉమ్మడిగా కార్యక్రమాలు రూపొందించుకోవడానికి ఉమ్మడి కేడర్‌తో పాటు అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఇక్కడ నుంచి పురందేశ్వరిని లోక్‌సభ బరిలో దింపాలని అధిష్ఠానం చూస్తు న్న సంగతి తెలిసిందే.ఈ మేరకు పురందేశ్వరి కూడా సిద్ధంగా ఉన్నారు. ఈ స్థానాన్ని బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కూడా ఆశిస్తు న్నారు. అయితే అవకాశం లేదని అధిష్ఠానం ఇప్పటికే స్పష్టం చేసినట్టు సమాచారం. ఇక జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానం కావాలని బీజేపీ కోరుతు న్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా అనపర్తి అసెంబ్లీ స్థానం తెరమీదకు వచ్చింది. కానీ ఇప్పటికే అక్కడ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరును ప్రకటించిన సంగతి తెలిసిందే. స్థానిక వైసీపీ ఎమ్మెల్యేకు దగ్గర బంధువైన ఓ వ్యక్తి వేరే రాష్ట్రం నుంచి బీజేపీలో కొందరి ముఖ్యు లతో సంబంధాలు పెట్టుకుని ఉన్నట్టు సమాచారం. ఆయనతో బీజేపీ మీద ఒత్తిడి తెచ్చి అనపర్తిలో పోటీ చేస్తే వైసీపీ అభ్యర్థికి మేలు జరుగుతుందనే యోచనతో కూడా ఇక్కడ కొందరు ప్రయ త్నం చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. కానీ ఇక్కడ టీడీపీ అభ్యర్థి గట్టినాయకుడే. నిత్యం పోరాటాలతో ప్రజల్లో ఉంటున్నారు.దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు కూడా రామకృష్ణారెడ్డికే మద్దతు ఇస్తుండడం గమనార్హం. ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది.లోక్‌సభ అభ్యర్థిని నేరుగా బీజేపీ జాతీయనేతలే ప్రకటించనున్నారు. ఇప్పటికే అసెంబ్లీ అభ్యర్థులు ప్రచారంలో ఉన్నారు.

విద్యుత్ సమస్య ఉంటే డయల్ 1912

పొగాకు బ్యారన్లు దగ్ధం 8

గెలిచి.. చంద్రబాబుకు కానుకగా ఇస్తా...



నా పుట్టినరోజున టిక్కెట్ ప్రకటించి చంద్రబాబు నాకు గిఫ్ట్ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేసుకుని ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పని చేస్తా. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తా. అమలాపురం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తాను.

- గంటి హరీష్‌మాధుర్, అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటా...



గత ఐదేళ్లలో అంకితభావంతో చేసిన సేవలను టీడీపీ అధిష్ఠానం గుర్తించి మరోసారి అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను ప్రకటించింది. దుర్మార్గ పాలన అందిస్తున్న జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు ఓటర్ల ముందుకు వెళ్లి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తాను. నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

- అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం టీడీపీ అభ్యర్థి

కాకినాడ సిటీలో గెలిచి చూపిస్తా...



చంద్రబాబు నాపై ఎంతో నమ్మకంతో ఈ సీటు కేటాయించారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కాకినాడ సిటీలో గెలిచిచూపిస్తా. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ఎన్నికల బరిలో దిగుతాను. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలే ఉమ్మడి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయి.

- వనమాడి కొండబాబు, కాకినాడ సిటీ టీడీపీ అభ్యర్థి



ఇక యుద్ధమే

కూటమి లెక్క తేలింది | పోరు మిగిలింది

- టీడీపీ మూడో జాబితా విడుదల
- 2 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన
- కాకినాడ సిటీకి కొండబాబు
- అమలాపురానికి ఆనందరావు
- అమలాపురం లోక్‌సభకు హరీష్‌మాధుర్
- మిగిలింది రాజమండ్రి లోక్‌సభ
- ఉమ్మడి జిల్లాలో 21 స్థానాలకు ఎంపిక
- నేడు పి.గన్నవరం అభ్యర్థి ప్రకటన
- అభ్యర్థులు మంగళగిరి పయనం


టీడీపీ టిక్కెట్లపై ఉత్కంఠ వీడింది.. నిన్నటి వరకు కాకినాడ సిటీ, అమలాపురం టిక్కెట్లపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఎవరు బరిలో ఉంటారు.. ఎవరు ఉండరనే దానిపై.. ఏ పార్టీ నుంచి పోటీ ఉంటుందనే దానిపై రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తూ వచ్చారు. ఎట్టకేలకు టీడీపీ మూడో జాబితా విడుదల చేసి సస్పెన్స్‌కు తెరదించింది. ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్ర వరం లోక్‌సభ, పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి తేలవలసి ఉంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి/ అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠకు తెరపడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన దాదాపు పూర్తయింది. టీడీపీ శుక్రవారం విడుదల చేసిన మూడో జాబితాలో కాకినాడ సిటీ అసెంబ్లీ, అమలాపురం అసెంబ్లీ, అమలాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఉత్కంఠకు తెరదించింది. కాకినాడ సిటీ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని బలంగా ఢీకొట్టగలిగే నేతను ఎంపిక చేయడంపై పార్టీ హైకమాండ్ దృష్టి సారించింది. సామాజికవర్గ సమతూకంపైనా కసరత్తు చేసింది. చివరకు మత్స్యకార సామాజికవర్గానికే సీటు కేటాయించింది. దీనిలో భాగంగా ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌ఛార్జి అయిన మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబువైపే మొగ్గు చూపింది. ఆయన్నే అభ్యర్థిగా ఖాయం చేసింది. ఇదిలా ఉండగా కోనసీమ జిల్లాలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ప్రకటించారు. అడుగడుగునా ఆటంకాలను ఎదుర్కొని అమలాపురం అసెంబ్లీ సీటు దక్కించుకున్నారు. ఇందుకు మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణ తనయుడు రమణబాబుతో పాటు ఆయన వర్గం నేతలు చేసిన కృషి ఫలించింది. పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించే అయితాబత్తుల ఆనందరావును అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కార్యకర్తల్లో జోష్ పెరిగింది. మిగిలిన పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానానికి జనసేన అభ్యర్థిని శనివారం అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది. అమలాపురం లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్‌ను ఎంపిక చేసింది. టీడీపీ అధిష్ఠానానికి అత్యంత విధేయుడిగా ఉన్న హరీష్‌మాధుర్‌కే అమలాపురం లోక్‌సభ అభ్యర్థిత్వం కట్టబెట్టింది. అమలాపురం లోక్‌సభ సీటు కోసం హరీష్‌తో పాటు ఐఏఎస్ అధికారి సతీమణి డాక్టర్ సత్యశ్రీ, పారిశ్రామికవేత్త యాతాటి రమేష్‌బాబు ప్రయత్నించారు. సత్యశ్రీ పట్ల అధిష్ఠానం చివరి క్షణం వరకు ఒకింత సానుకూలతతో ఉన్నప్పటికీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కీలక భూమిక వహించడంతో టిక్కెట్ హరీష్‌నే వరించింది. అయినవిల్లి సిద్ధివినాయక స్వామి ఆలయంలో పూజలు చేసే సమయంలో హరీష్‌ను అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనకు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చారంటూ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

21 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 22 అసెంబ్లీ స్థానాలు ఉండగా 21 స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ఎంపిక మొత్తం పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థుల ఎంపికపై టీడీపీ, జనసేన పార్టీలు ఎట్టకేలకు స్పష్టతనిచ్చేశాయి. ఇన్నాళ్లు కొన్ని సీట్లపై పీటముడి కొనసాగింది. శుక్రవారం మిగిలిన రెండు సీట్లు ప్రకటించడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క స్థానం మినహా అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. కాకినాడ లోక్‌సభ పరిధిలోని ఏడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తేలిపోయింది. మొత్తం ఏడు సీట్లలో టీడీపీ ఐదుచోట్ల, జనసేన రెండుచోట్ల పోటీ చేయడం ఖాయమైంది. ఇటీవల పవన్ పిఠాపురం సీటు నుంచి తానే పోటీ చేస్తున్నట్టు స్వయంగా వెల్లడించడంతో సస్పెన్స్ వీడింది. కాకినాడ సిటీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం జరిగింది. టీడీపీ మాత్రం ఈ స్థానంపై ఎడతెగని కసరత్తు చేసింది. ప్రత్యర్థి వైసీపీ తరపున ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థికంగా బలంగా ఉండడంతో అదే స్థాయిలో బలమైన అభ్యర్థిని నిలబెట్టే ఉద్దేశంతో టీడీపీ అధిష్ఠానం ఈ సీటుపై వ్యూహాత్మకంగా కదిలింది. ఇతర సామాజికవర్గాల నుంచి బలమైన అభ్యర్థులను సీటు కోసం పరిశీలించింది. కాకినాడ సిటీలో అత్యధికంగా మత్స్యకార సామాజికవర్గం ఉండడంతో వారికి తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. ఈ మేరకు ఆ సామాజికవర్గం వైపే మొగ్గుచూపింది. జిల్లాలో ఒక సీటు మత్స్యకారులకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుండడంతో దాన్ని కాదనలేకపోయింది. అనేక తర్జనభర్జనల తర్వాత చివరకు మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొండబాబు పేరునే ఖాయం చేసింది. దీంతో కాకినాడ జిల్లాలో ఏడు స్థానాల్లో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. మొత్తం ఏడు స్థానాల్లో రెండు సీట్లను బీసీలకు కేటాయించి వెనుకబడిన వర్గాలకు టీడీపీ పెద్దపీట వేసింది. వైసీపీ కూడా ఇప్పటికే ఏడు సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. ఒక్కటంటే ఒక్క సీటు కూడా జిల్లాలో బీసీలకు ఇవ్వకుండా వారిని అవమానించింది. మొత్తం అన్ని సీట్లు ఓసీలకు కట్టబెట్టడంతో వైసీపీ తీరుపై బీసీ వర్గాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. బీసీ వ్యతిరేక పార్టీగా వైసీపీపై కారాలు మిరియాలు నూరుతున్నారు. అటు వైసీపీలో కొన్ని సీట్లకు బీసీ అభ్యర్థులు పోటీకి సిద్ధమైనా కనీసం వారెవరినీ పరిగణలోకి తీసుకోకపోవడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో టీడీపీ 5 జనసేన 2 స్థానాల్లో బరిలో ఉన్నాయి. ఏడు అసెంబ్లీ స్థానాల్లో రెండు ఎస్సీ, ఒకటి బీసీ, నాలుగు ఓసీలకు కేటాయించారు. ఎంపీ అభ్యర్థి తేలవలసి ఉంది. రాజమహేంద్రవరం లోక్‌సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తారని సమాచారం. కోనసీమ జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఆరుచోట్ల అభ్యర్థులను ప్రకటించారు. మూడు ఎస్సీ, ఒక బీసీ, రెండు స్థానాలు ఓసీలకు కేటాయించారు. పి.గన్నవరం అసెంబ్లీ స్థానం విషయానికొస్తే తొలి జాబితాలో టీడీపీ తరపున సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. తదనంతర పరిణామాల్లో ఆయన వైదొలగడంతో సీటును జనసేన, బీజేపీల్లో ఎవరికి కేటాయిస్తారో అన్న సందిగ్ధత నెలకొంది. జనసేనకే కేటాయించనున్నట్టు పార్టీ పెద్దలు సానుకూలంగా సంకేతాలు పంపాయి. విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును అధిష్ఠానం దాదాపు ఖరారు చేసిందని, శనివారం లాంఛనంగా ప్రకటించనున్నట్టు సమాచారం అందింది. శనివారం మంగళగిరిలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు హరీష్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు పయనమయ్యారు.



ఈసీ చెప్పినా.. లెక్కలేదా!

కోడ్ వచ్చినా మారని వైసీపీ నాయకుల తీరు


- నేటికీ యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు
- అధికారులకు ఆదేశాలు.. కాదంటే హెచ్చరికలు
- పార్టీ కార్యాలయాలపై తొలగని బొమ్మలు
- రేషన్ వాహనాలపైనా ఇదే పరిస్థితి
- కోడ్ వచ్చి నాలుగు రోజులైనా ఇంతే
- కన్నెత్తి చూడని అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బూతుల మంత్రులను చూసి విస్మయం చెందిన జనం.. జగన్ జమానాలో పద్ధతి 'గాలి'వాటం అయిందంటూ పెదవి విరుస్తున్నారు.ఇప్పుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) పాటించకపోవడం, ఎన్నికల సంఘం ఆదేశాలనూ ధిక్కరించడం చూసి నివ్వెరపోతున్నారు.ముందు నుంచీ క్రమశిక్షణ అనే పదాన్ని పెద్దగా పట్టిం చుకోని వైసీపీ నాయకులు 'చివరికి' రాజ్యాంగ స్ఫూర్తికీ వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారంటూ ప్రజలు రుజువులు చూపుతూ ఆరోపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి ఆరు రోజులు గడిచినా ఇంకా తీరు మాత్రం మారలేదు.అధికారులపై ఇప్పటికీ దర్పం ఒలకబోస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఎంపీ భరత్‌రామ్ తీరుతో ఏకంగా 23 మంది వలంటీర్లకు కంటతడి తప్పలేదు.

ఇప్పటికీ మారని తీరు!

వైసీపీ నాయకులు ముందు నుంచీ బెదిరింపులు, దాడులు, అసాంఘిక కార్యకలాపాలతోనే నెట్టుకొచ్చారు. ప్రశ్నిస్తే పోలీసులను ప్రయోగించి ముప్పుతిప్పలు పెట్టారు. ఈ నాలుగేళ్ల పది నెలల్లో ప్రభుత్వోద్యోగుల నరకం అంటే ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నారంటే అతిశయోక్తి కాదు. చట్టాన్ని పట్టించుకోకుండా మౌఖిక ఆదేశాలు ఇచ్చేయడం.. ఒత్తిడికి తలవంచి అధికారులు నిబంధనలకు నీళ్లొదిలేయడం పరిపాటిగా మారింది. నిబంధనల గురించి చెప్పిన అధికారులపై గట్టి మొట్టికాయ, ఒక్కోసారి వేటు పడేది. కాస్త సౌమ్యంగా, ముక్కుసూటిగా ఉండే అధికారులంటే వైసీపీ పాలకులకు అసలు పడేది కాదు. ఓ ప్రతిపక్ష కార్యకర్తపై రౌడీషీటు తెరవడానికి నిబంధనలు ఒప్పుకోవని చెప్పినందుకు ఓ సీఐని వీఆర్‌కి పంపేశారు. జిల్లాలో ఇది ఓ ఉదాహరణ మాత్రమే. ఎదురు ప్రశ్న వేయకుండా డూడూ బసవన్నల మాదిరిగా 'పని చేసిపెట్టే' అధికారుల ఉద్యోగం జీవితం సాఫీగా సాగేది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వోద్యోగులు ఎన్నికల సంఘం పరిధిలోకి వెళతారు. ఇప్పటికీ యంత్రాంగం ప్రభుత్వ కనుసన్నల్లోనే పనిచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధుల ఇంకా వారిపై ప్రభావం చూపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఎంపీ భరత్ రామ్ ఎన్నికల సంఘం ఆదేశాలను ఉల్లంఘిస్తూ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయడం ఆ విమర్శలకు బలాన్ని చేకూరుస్తోంది. స్వచ్ఛందంగా నియమావళిని అనుసరించి ఇతరులకు ఆదర్శంగా ఉండాల్సిన అధికార పార్టీ నాయకులు ఉల్లంఘనుల్లో మొదటి వరుసలో ఉంటున్నారు. చివరికి చిన్నారులకు ఇచ్చే చిక్కీలపైనా జగన్ బొమ్మను చూసి జగం నవ్వుకున్నారు. ఆ యావ ఎన్నికల కోడ్‌నూ పట్టించుకోవడం లేదు.ఈ నెల 16న సాయంత్రం 3 గంటల సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ఇప్పటికీ అధికార పార్టీ హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు దర్శనమిస్తూనే ఉన్నాయి. రూరల్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి చెల్లుబోయిన వేణు బొమ్మూరులో ఏర్పాటు చేసిన రూరల్ తాత్కాలిక కార్యాలయం బోర్డులపై జగన్ బొమ్మలు దర్జాగా దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు లేరు.



ఇదేం చేస్తారు: ఇటీవల ఇచ్చిన ఇంటి పట్టా మధ్యలో జగన్ బొమ్మ

యంత్రాంగం వేగం పుంజుకోలేదా?

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉన్నతాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రేయింబవళ్లు పోలింగ్ స్టేషన్లు పరిశీలన, సమావేశాలతో సరిపోతోంది. అయితే క్షేత్రస్థాయిలో యంత్రాంగం ఇంకా వేగం పుంజుకోలేనట్టుగా కనిపిస్తోంది. ప్రధాన కూడళ్లలో ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీలు ఉంటున్నా మీడియా చెప్పే వరకూ తొలగించలేదు. ప్రభుత్వ ఆస్తులు, భవనాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, హోర్డింగులు ఉండొద్దని 24 గంటల్లో పూర్తిగా తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఆ రోజు నుంచీ ఆదేశిస్తూనే ఉన్నా ఉల్లంఘనలు కనిపిస్తూనే ఉన్నాయి. కొన్ని బోర్డులపై చిత్రాలు కనబడకుండా కాగితాలను అతికిస్తున్నారు. అవి ఊడిపోతూ నిబంధనలను వెక్కిరిస్తున్నాయి.



రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి, మంత్రి వేణు బొమ్మూరులో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయంపై జగన్, వేణు బొమ్మలు

అనుమతులు ఉండాల్సిందే

అనుమతులను సరళతరం చేయడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం 'సువిధ' అనే ఒక వెబ్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చింది. ఎంత సులభతరం చేసినా ఉల్లంఘనలు ఆపడం ఎవరి తరమూ కావడం లేదు. రాజకీయ పార్టీలు/అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సిన 25 అంశాలను నిర్దేశించింది. సువిధలో దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల సంఘానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి వస్తుంది. వాళ్లు సంబంధిత పత్రాలను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారు. అవి ఆయా కార్యక్రమాల వద్ద తప్పనిసరిగా అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కొన్నిటికి జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) అనుమతి పొందాల్సి ఉంది. ప్రస్తుతం ఏఏ పార్టీలు వేటికి అనుమతులు ఎప్పటి వరకూ తీసుకున్నాయో జిల్లా స్థాయిలో వివరాలు అందుబాటులో లేనట్లు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ చూసీ చూడకుండా వదిలేస్తున్నారా? అనే అనుమానం సామన్యుడిలో రేకెత్తుతోంది.

తలపోటుగా ..జగన్ యావ

ప్రతి వస్తువుపైనా జగన్ బొమ్మే.. తినే పదార్థాలపైనా ఆయన చిత్రమే. వాస్తవానికి ప్రభుత్వం శాశ్వతం, పాలకులు అశాశ్వతం. కానీ, జగన్ ప్రచార యావ ఆ సత్యానికి విరుద్ధంగా సాగింది. ఇప్పుడు ఆ జగన్ ప్రచార యావ ఎన్నికల వేళ అధికారులకు పాట్లు తెచ్చిపెట్టింది. కొన్నిటిని ఎలా తొలగించాలో తెలియని సందిగ్ధంలో పడిపోయారు. ఉదాహరణకు భూములు లేకుండా ఇంటి స్థలాల జాతరలో భాగంగా ఎన్నికల కోడ్‌కి రెండు రోజుల ముందు పట్టాల పంపిణీ అంటూ హడావుడి చేశారు. ఆ పట్టాలపై జగన్ బొమ్మ ఎలా తీయాలో తెలియని అయోమయం నెలకొంది. ఆ పట్టాలు చింపివేయడం మినహా వేరే దారి లేదు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా వాటి పంపిణీ జరిగింది. వాట్సాప్‌లోనూ పంపించారు. పాఠశాలలకు, వాటర్ ట్యాంకులకు ఇలా ప్రభుత్వ భవనాలు తదితర వాటిని వైసీపీ రంగులతో నింపేశారు. వాటిని ఇప్పుడు ఎలా గీకాలో తెలియడం లేదు. రేషన్ పంపిణీ వాహనాలపై పెద్ద పెద్దగా జగన్ బొమ్మలను వేశారు. వాటిపై ఇప్పుడు కాగితాలు అంటించారు. అవి ఎన్నికలు ముగిసే వరకూ ఉంటాయా? అనేది మీమాంస.

నిర్మలగిరి ఉత్సవాలు ఆరంభం



దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని నిర్మలగిరి మేరిమాత ఉత్సవాలు శుక్రవారం ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. కులమతాలకతీతంగా భక్తులు పాల్గొన్నారు. హిందువులు తలనీలాలు ఇచ్చి.. ముడుపులు సమర్పించి.. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు.. 25వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. శని, ఆదివారాల్లో సుమారు 3 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. -8లో

ఏప్రిల్ 5 నుంచి ధాన్యం కొనుగోళ్లు


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మస్తాన్

కొవ్వూరు, మార్చి 22: ఏప్రిల్ 5వ తేదీ నుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్నట్టు తహశీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు, లేబర్, ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధాన్యం సేకరణకు పంట నమోదు తప్పనిసరి అని, అలాగే ట్రాన్స్‌పోర్టు వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ పరికరం అమర్చి ఉండాలన్నారు. గ్రేడు-ఎ రకం ధాన్యం రకానికి క్వింటాకు రూ.2203, కామన్ రకానికి క్వింటాకు రూ.2183 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, వ్యవసాయాధికారి ఎ.గంగాధర్, సీఎస్ డీటీ సునీత తదితరులు పాల్గొన్నారు.

'పది' గణితం పరీక్షకు 128 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 22: కొవ్వూరు పట్టణ, మండలంలో పదో తరగతి గణితం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 8 పరీక్షా సెంటర్లలో 1456 మంది పరీక్ష రాయవలసి ఉండగా 1330 మంది హాజరు కాగా 128 మంది గైర్హాజరయ్యారయినట్టు డీవైఈవో కె.వాసుదేవరావు తెలిపారు.

తాళ్లపూడిలో అన్నసమారాధన

తాళపూడి, మార్చి 22: తాళ్లపూడిలో రుక్మిణీ, సత్యభామ సమేత మదన గోపాలస్వామి కల్యాణం సందర్భంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సింహాద్రి జనార్ధన్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్ధన్‌ను ఆర్యవైశ్య ప్రముఖుడు గోకవరపు బాబులు సత్కరించారు.

నిర్భయంగా ఓటేయాలి : తహశీల్దార్


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

తాళ్ళపూడి, మార్చి 22: ఓటర్లు నిర్భయంగా ఓటేయాలని, వేగేశ్వరపురం సమస్యాత్మక గ్రామం కాదు.. ఉత్తమ గ్రామమనేలా ఓటర్లు అందరూ ఓటు ఉపయోగించుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఓటు హక్కు వినియోగంపై గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు దాటిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోకపోతే.. త్వరగా నమోదు చేసుకోవాలని, ఇంకా సమయం ఉందని చెప్పారు. కార్యక్రమంలో స్వీప్ కోఆర్డినేటర్ జోడాల వెంకటేశ్వరరావు, వీఆర్వో సంజీవరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల చలో ఢిల్లీకి మద్దతు

చాగల్లు, మార్చి 22: ఢిల్లీలో జరిగే రైతు సభకు మద్దతుగా శుక్రవారం చాగల్లులో రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘం నాయకుడు జీవీ సుబ్బారావు మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కారం కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నామన్నారు. రబీ వరి కోతలు ప్రారంభమైనందున వ్యవసాయ శాఖ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. దళారుల నుంచి రక్షించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కేకే దుర్గారావు, సీఐటీయూ నాయకుడు ఎస్‌కే ఆదాం, రైతు సంఘం నాయకులు కంకటాల బుద్దుడు, కొఠారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో విద్యార్థికి గాయాలు


కోతుల దాడిలో గాయపడ్డ అమన్

గోపాలపురం, మార్చి 22: వాదాలకుంట రోడ్డులోజూట జామియామసీదు సమీపంలో కోతులు దాడి చేసిన సంఘటనలో 9వ తరగతి విద్యార్థి సయ్యద్ అమన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు వివరాల మేరకు మసీదు సమీపంలో తాము నివాసం ఉంటున్న మొదటి అంతస్తులో మెట్ల పైనుంచి ఇంటిలోకి వెళ్తున్న అమన్‌పై సుమారు పది కోతులకు పైగా వచ్చి ఒక్కసారిగా దాడి చేశాయని, అమన్ మొదటి అంతస్తు పైభాగం నుంచి కింద పడిపోవడంతో మోచెయ్యి కింది భాగం విరిగిపోవడంతో పాటు వెన్నుముకకు బలమైన దెబ్బతగిలిందన్నారు. కొయ్యలగూడెం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్టు చెప్పారు. కొంతకాలంగా గోపాలపురంలో జనావాసాల మధ్య కోతుల సంచారం ఎక్కువైందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు అంటున్నారు.

దొండపూడిలో రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

రూ.7 లక్షల ఆస్తినష్టం


పొగాకు బ్యారన్ ద్వారం నుంచి ఎగసిపడుతున్న అగ్ని కీలలు

గోపాలపురం, మార్చి 22: మండలంలోని దొండపూడిలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ రెండు పొగాకు బ్యారన్‌లు కాలిబూడిదయ్యాయి. స్థానికులు వివరాల మేరకు.. గ్రామంలో మద్దాల స్వాతి, పెనుభూతుల నాగజ్యోతిమౌనికలకు చెందిన పొగాకు బ్యారన్‌లో శుక్రవారం తెల్లవారుజాము అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమించాల్సి వచ్చింది. బయట నుంచి మంటలను ఆర్పేందుకు వీలు లేకపోవడంతో ముఖద్వారం కిటికీల నుంచే అదుపు చేశారు. ఈ ఘటనలో స్వాతికి చెందిన బ్యారన్‌లో పొగాకు దగ్ధమై రూ.5 లక్షలు, మౌనిక బ్యారన్‌కు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది అంచనావేసినట్టు తెలిపారు.

బాలదుర్గమ్మ ఆలయానికి వితరణ

దేవరపల్లి, మార్చి 21: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయానికి దాతలు ఢమరుకం, మైక్‌సిస్టమ్, గర్భగుడిలో పాలరాయి ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన నారాయణ విశ్వేశ్వరరావు, లక్ష్మీరాణి దంపతులు పాలరాయిని గర్భగుడిలో అమర్చారు. తీగల లక్ష్మీనారాయణ గాయిత్రీ దంపతులు సౌండ్ సిస్టమ్‌ను విరాళంగా అందజేశారు. కరుటూరి శ్రీనివాస్, సత్యవాణి దంపతులు ఢమరుకం అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థ ప్రసాదాలు అందజేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కమిటీ సభ్యులు కామిశెట్టి దుర్గారావు, పైడికొండల శివయ్య, పిన్నమని వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, మార్చి 22: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరారావు శుక్రవారం తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో మద్యం విక్రయిస్తున్న ఆశపు ప్రసాద్‌ను అరెస్టు చేసి అతడి నుంచి 6 బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

హోళీకి ప్రత్యేక రైలు

రాజమహేంద్రవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): హోళీ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈ నెల 23న రైలు నెం.07645 సికింద్రాబాద్-సంత్రాగచి, ఈ నెల 25న రైలు నెం.07646 సంత్రాగచి-సికింద్రాబాద్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. వీటికి విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోటలో హాల్ట్ సదుపాయం కల్పించారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుకు 1912

- ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ
- కొవ్వూరులో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక


వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సత్యనారాయణ

కొవ్వూరు, మార్చి 22: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) పనిచేస్తోందని ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. కొవ్వూరు ట్రాన్స్‌కో సబ్ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార క్యాంపు కోర్టు (సమస్యల పరిష్కార వేదిక) నిర్వహించారు. ఆయన విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫిర్యాదు చేయవచ్చని, నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 2016 నుంచి ఇప్పటివరకు సీజీఆర్ఎఫ్‌కు 7895 ఫిర్యాదులు రాగా 7757 పరిష్కరించామని, 111 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 100 కేసుల్లో ఫిర్యాదుదారులకు విద్యుత్ సేవల అమలులో జాప్యానికి రూ.5,45,050 చెల్లించామన్నారు. గతేడాది 536 ఫిర్యాదులొచ్చాయని, వాటిలో 437 పరిష్కరించామన్నారు. నిర్ణీత సమయంలో పరిష్కారం కాని ఫిర్యాదుదారులకు సేవల అమలులో జాప్యానికి పరిహారం చెల్లిస్తారన్నారు. ఇప్పటివరకు సంస్థ ఆధ్వర్యంలో 68 అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి అవగాహన కల్పించామన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో 19 వ్యవసాయ మోటార్లకు భూగర్భజలాలు అడుగంటి నీరు రాకపోవడంతో 5హెచ్‌పీ మోటార్లను తీసివేసి 7.5 హెచ్‌పీ మోటార్లను అనధికారికంగా వేశారని, వాటిని క్రమబద్ధీకరించి మోటార్ల కెపాసిటీకి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయాలని రైతులు రాత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎం.శ్రీనివాస్, రాయసం సురేంద్రకుమార్, విద్యుత్‌శాఖ ఈఈ బి.వీరభద్రరావు, ఏడీఈ పి.అచ్యుతాచారి, ఏఈలు డి.జగదీశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో సూపర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి!

- అధికారంలోకి వచ్చిన వెంటనే ఏర్పాటు
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు
- ఘంటావారిగూడెం వరకు సాగిన సంకల్పయాత్ర


సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల, మార్చి 22: గోపాలపురం నియోజకవర్గంలో 3 లక్షల ప్రజానీకం ఉంటే కనీసం ఒక సూపర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి లేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు, మోదీ ఆశీస్సులతో నల్లజర్లలో అటువంటి ఆసుపత్రి ఒకటి ఏర్పాటు చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు హామీ ఇచ్చారు. గౌరీపట్నం నుంచి ద్వారకా తిరుమల వరకు నిర్వహిస్తున్న సంకల్పయాత్ర శుక్రవారం నల్లజర్ల మండలంలో అనంతపల్లి నుంచి ఘంటావారిగూడెం వరకు సాగింది.ఈ సందర్భంగా నల్లజర్లలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సమూల ప్రక్షాళన చేస్తానని చెప్పారు. తాను కలలు కనే నియోజక అభివృద్ధికి మానవ శక్తితోపాటు దైవ శక్తి అవసరం ఉందని, భగవంతులను వేడుకునేందుకు ఈ యాత్ర చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు శెట్టిపల్లి శివనాగరాజు, జమ్ముల సతీష్, గురిమిల్లి శ్రీను, నిమ్మలపూడి ప్రసాద్, కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీనివాసరావు, అబ్బూరి నరేష్, పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు, రుద్ర శ్రీను, అచ్యుత సత్యనారాయణ, షేక్ మీరాసాహెబ్, రాజా బ్రదర్, కూసంపూడి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి రాంబాబు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అప్పుల ఊబిలోకి రాష్ట్రం

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు


చాగల్లు: నందిగంపాడులో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో ముప్పిడి

కొవ్వూరు, మార్చి 22: వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పశివేదలలో శుక్రవారం ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీలతో ఆయన సమావేశమయ్యారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని, పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావాలన్నారు. కూటమి అభ్యర్థియైన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కోడూరి లక్ష్మీనారాయణ, కొప్పిరెడ్డి రాజబాబు, బేతిన నారాయణ, గారపాటి శ్రీనివాసరావు, రామచంద్రరావు, సుంకర సత్తిబాబు, కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులంతా టీడీపీ వైపే..

దళితులంతా టీడీపీ వైపే ఉన్నారని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిలు మరపట్ల కళాధర్, పెనుమాక జయరాజు అన్నారు. తెలుగుదేశం కొవ్వూరు నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ దళిత నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికీ వాటన్నిటినీ వదిలిపెట్టి అధిష్ఠానం నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి దళితులు వెన్నుముకలా నిలిచారని, పార్టీ కూడా అదేవిధంగా గుర్తింపు నిచ్చిందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు పార్టీ అధిష్ఠానం గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిందని, ఆయనకు మద్దతునిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు తిగిరిపల్లి గోపి, కొక్కిరిపాటి వెంకటేష్, కొక్కిరిపాటి శ్రీహరి, మనెల్లి నాని, వేమగిరి వెంకట్రావు, జొన్నకూటి వెంకాయమ్మ, బొంతా కిషోర్, అయినపర్తి రాజేంద్రప్రసాద్, పాలూరి నీలిమ తదితరులు పాల్గొన్నారు.


పెరవలి: వెంకటరాయపురంలో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు

చాగల్లు, మార్చి 22: మండలంలోని దారవరం, బ్రాహ్మణగూడెం, చిక్కాల పాలెం, చిక్కాల గ్రామాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పర్యటించి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి విధ్వంస పాలన పోవాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందుకు అందరు సమష్టి కృషితో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కేతా సహాబ్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని పెరవలి, కొత్తపల్ల, అజ్జరం, వెంకటరాయపురం గ్రామాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు.. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి దుర్గేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ముళ్లపూడి వెంటే మేము

- బాపిరాజుకు సముచిత స్థానం కల్పిస్తేనే అభ్యర్థికి మద్దతు
- నల్లజర్ల సమావేశంలో పలువురి టీడీపీ నాయకులు


సభలో మాట్లాడుతున్న వక్తలు

నల్లజర్ల, మార్చి 22: జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వెంటే తామంతా ఉంటామని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. గురువారం రాత్రి నల్లజర్లలోని ప్రియాంక కన్వెక్షన్ హాల్‌లో టీడీపీ మండల స్థాయి సమావేశం మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ, సీనియర్ నాయకులు అల్లాడ రాజారావు, వల్లూరి సత్తిపండు, మాజీ జడ్పీటీసీ కొఠారు అనంతలక్ష్మి, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, ఏలేటి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా మండలాన్ని టీడీపీకి కంచుకోటగా తయారు చేసి, జడ్పీ చైర్మన్‌గా గోపాపురంతోపాటు తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ముళ్లపూడి బాపిరాజుకు పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం కల్పించి, మద్దిపాటిని, ముళ్లపూడిని సమన్వయం చేస్తే తప్ప తాము ఎన్నికలకు ముందుకొచ్చే పరిస్థితి లేదని, తామంతా ముళ్లపూడి వెంటే ఉంటామని ముక్తకంఠంతో చెప్పారు. బాపిరాజు విద్యార్థి దశ నుంచి పార్టీ కోసం పనిచేసి, మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్‌తో ఢీకొని తెలుగుదేశం సత్తా ఏంటో చూపించిన వ్యక్తి బాపిరాజు అన్నారు. అదిష్ఠానం రంగంలో దిగి పార్టీని సమష్టిగా బలోపేతం చేయవలసిన అవసరం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో గుదే సుబ్బారావు, ఉప్పు నరేష్, ఉండవల్లి గోపి, ఈడే శ్రీను, బొట్టా శ్రీను పాల్గొన్నారు.

మేరీమాత ఉత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి 22: గౌరీపట్నం కొండపై 44 ఏళ్ల క్రితం మరియమ్మతల్లి వెలిసిందని, అప్పటి నుంచి ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక నిలయంగా నిర్మలగిరి పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందిందని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గౌరీపట్నం మేరీమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రాన్ని ప్రాంతాలకు, మతాలకు అతీతంగా ప్రజలు దర్శించుకుంటారన్నారు. ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో వస్తారన్నారు. శని, ఆదివారాల్లో సుమారు 3లక్షల మంది భక్తులు హాజరవుతారని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్ బాల, ఫాదర్ మోజేష్, ఫాదర్ జార్జ్ ఫిలిప్, ధర్మరాజు పాల్గొన్నారు.


విద్యుత్ కాంతుల్లో మేరీ మాత ఆలయం



యర్నగూడెంలో వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

దేవరపల్లి, మార్చి 22: మండలంలోని యర్నగూడెంలో అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 22 నుంచి 25 వరకు నిర్వహిస్తారని 25న విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులు విగ్రహ ప్రతిష్ఠ నిర్వాహకుడు, సిద్ధాంతి రావిపాటి వరప్రసాద్ గ్రామస్థులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

డ్రగ్స్, గంజాయిలకు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: కొకైన్, గంజాయి వంటి మత్తుమాదక ద్రవ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్‌ను సీఎం జగన్ మార్చేశాడని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ సముద్రతీరానికి డ్రగ్స్ కంటైనర్ రావడం దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిందన్నారు. ఇప్పటి వరకు గంజాయికి అడ్డాగా ఉన్న ఏపీని ఇప్పుడు డ్రగ్స్‌లో అంతర్జాతీయ స్థాయికి జగన్ తీసుకెళ్లాడని ఆరోపించారు. ఎన్నికల వేళలో 25000 కిలోల డ్రగ్స్‌ను విశాఖకు తరలించడం వెనుక పెద్దకుట్ర దాగివుందన్నారు. వచ్చిన డ్రగ్స్‌ను వెంటనే తని ఖీ చేయకుండా ప్రభుత్వం ఎందుకు అడ్డుకుందని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఓటర్లకు ఎంపీ భరత్ తాయిలాలు

టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు


బోగస్ పట్టాలను చూపిస్తున్న కూటమి నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: రాజమహేంద్రవరం ఓటర్లకు తాయిలాలు, వలంటీర్లలతో బేరసారాలు ఆడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్ పనైపోయిందని టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో జనసేన నగర ఉపాధ్యక్షుడు రాజేష్ ఖన్నా, కార్యదర్శి తేజోమూర్తుల నర్సింహరావు, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు మాట్లాడారు. ఎంపీ భరత్‌రామ్ ప్రజల సొమ్ముతో సోకులు చేస్తున్నాడని, కార్పొరేషన్‌కు ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో నగరంలో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నారని భరత్ ఎంపీ నిధులతో ఏమీ చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.125 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించారని చెబుతున్న ఎంపీ రూ.30 కోట్లతో మాత్రమే పనులు చేయించారని, మిగిలినదంతా కార్పొరేషన్ నిధులలేనన్నారు. ఆయన చేసిన నీచపు పని వల్ల నగరంలో 23 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారన్నారు. రాజమహేంద్రవరాన్ని గంజాయికి అడ్డాగా భరతే మార్చేశాడన్నారు. ఇటీవల పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో ఇచ్చినవి బోగస్ పట్టాలని, పేదలను మోసం చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు ఒరిజినల్ పట్టాలతో పాటు భూములు అప్పగిస్తారన్నారు. సమావేశంలో టీడీపీ లీగల్ అధ్యక్షుడు నామా సత్యనారాయణ, కొమ్మర్తి బాబ్జి, ప్రకాష్ , పడాల నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన కామర్స్ లెక్చరర్ల శిక్షణ తరగతులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 22: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నూతన విద్యా విధానాన్ని అనుసరించి వాణిజ్యశాస్త్రంలో సరికొత్త బోధనా పద్ధతులపై నిర్వహించిన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం, కాకినాడ నోడల్ రిసోర్సు కేంద్రం పరిధిలోని 19 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.సుధాకర్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం ద్వారా ప్రతి విద్యార్థికి కావాల్సిన నైపుణ్యాలు అలవడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, నాలెడ్జ్ రిసోర్సు పర్సన్ కె.ప్రతిమ, ఆర్‌డీ శిరీషరెడ్డి, కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త ఏపీ అన్నపూర్ణ, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి వీవీ వీ సత్యనారాయణ, సీహెచ్ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22: వైసీపీ విధానాలతో విసుగుచెందిన వంద మంది మహిళలు టీడీపీలోకి చేరారు. రాజమహేంద్రవరం 34వ డివిజన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వైసీపీ మహిళలను టీడీపీ కండువాలతో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ వింత పాలనతో ప్రజలు చాలా అసంతృప్తిగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో పరాజయం తప్పదన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి కచ్చితంగా అధికారంలోకి వస్తుందన్నారు. విజనరీ కలిగిన చంద్రబాబు పాలనలో ప్రజలు ప్రశాంతమైన జీవితం గడుపుతారని, కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతిఒక్కరు శ్రమించాలని అన్నారు. కార్యక్రమంలో ఉప్పులూరి జానకిరామయ్య, యాళ్ళ ప్రదీప్, రెడ్డి పార్వతి, బీవీ శివారెడ్డి, పులి శ్రీనివాసరెడ్డి, మాలే విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


తాడిపర్రులో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ అప్పలరాజు

ఉండ్రాజవరం, మార్చి 22: రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ అప్పలరాజు పేర్కొన్నారు. శుక్రవారం తాడిపర్రు గ్రామంలో ఎన్నికల విధుల్లో భాగంగా పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు వేసేందుకు అధికారులకు, పోలీసులకు సహకరించాలని, ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.సత్యనారాయణ, వీఆర్వో లక్ష్మీనరసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో లక్షతులసి పూజ

ఉండ్రాజవరం, మార్చి 22: ఉండ్రాజవరంలో కేశవస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లక్షతులసి పూజలు జరిపారు. మహిళా భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	:	కుంగ్‌ఫూ పాండా..
వై.స్క్రీన్2	:	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	:	ఓం భీం బుష్
అనన్య	:	భీమా

నిడదవోలు

వీ మ్యాక్స్	:	ప్రేమలు
రాధాకృష్ణ	:	భీమా
శ్రీగణపతి	:	వెయ్ దరువెయ్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	:	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	:	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	:	భీమా
స్క్రీన్ 2	:	ప్రేమలు
శ్రీనివాస	:	గామి